RNI Reg-No.APTEL/2005/19204 ESTD : 1996

# నేటి మనదేశం

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

https://netimanadesam.com/

సంపుటి :21 సంచిక 55 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి మంగళవారం 24-2-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీవిశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర రుతువు, ఫాల్గుణ మాసం, తిథి ॥ సప్తమి ఉ॥ 7.48, అష్టమి తె ॥5.17, కృత్తిక మ॥3.56, దుర్ముహూర్తం ఉ॥8.51-9.36, శుభ సమయం మ॥ 12.00-1.30, రాహుకాలం మ॥3.00-4.30, సూర్యోదయం ఉ॥ 6.34, సూర్యాస్తమయం సా॥ 5.55 గం॥

నిస్వార్ధ భక్తితోనే మోక్ష సిద్ధి!

-ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు 2లో

# ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

## -పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికారులు
## -గంట ముందే కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు




**అమరావతి,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ):** రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభ మయ్యాయి. సోమవారం ఉదయం 9:00 గంటలకు ఈ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్ష సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని ఇప్పటికే ఇంటర్మీడియట్ బోర్డు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో విద్యార్థులంతా పరీక్ష ప్రారంభ సమయం కంటే దాదాపు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు మొత్తం 10,57,899 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. మొదటి సంవత్సరం పరీక్షకు 5,31,275 మంది విద్యార్థులు హాజరయ్యారు. రేపటి నుంచి అంటే మంగళవారం నుంచి మొదలయ్యే ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 5,26,264 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ పరీక్షల కోసం1,537 కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు సహా ఎలాంటి గాడ్జెట్‌లకు అనుమతి లేదని ఇప్పటికే విద్యార్థులకు బోర్డు స్పష్టం చేసింది. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద సీసీటీవీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసింది. అలాగే ఆ ప్రాంతంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. మార్చి 24వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. విద్యా సంవత్సరంలో చేపట్టిన సంస్కరణల నేపథ్యంలో మొదటి సంవత్సరం గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, సివిక్స్, కామర్స్, హిస్టరీ సబ్జెక్టులకు 32 పేజీల బుక్‌లెట్ ఇవ్వనున్నారు. మిగిలిన, బ్యాక్‌లాగ్ సబ్జెక్టులకు, రెండో సంవత్సరం అన్ని సబ్జెక్టులకూ 24 పేజీల బుక్‌లెట్‌ను అందజేయనున్నారు. ఈ బుక్‌లెట్‌లోనే విద్యార్థులు జవాబులు రాయాల్సి ఉంటుంది. అదనపు జవాబు పత్రాలు ఇవ్వరు.విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు వెంట తీసుకెళ్లకుండా పరిశీలించి లోపలికి అనుమతించారు. బాలురు కు పురుషులు, బాలికలకు మహిళా సిబ్బంది చెక్ చేసి లోపలికి అనుమతించారు. మొదటి పరీక్ష కావడంతో విద్యార్దులు వెంట తల్లి తండ్రులు వచ్చి పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లారు..విద్యార్దులు ఉత్సాహంగా ఒకరిని ఒకరు శుభాకాంక్షలు చెప్పుకుంటూ లోపలికి వెళ్ళారు. ఉదయం చేరుకున్న విద్యార్థులు వారి యొక్క హాల్ టికెట్స్ నెంబర్ల సరి చూసుకొని పరీక్ష కేంద్రం లోపలికి వెళ్ళారు.

# సునీల్ నాయక్ అరెస్ట్‌ను తప్పుపట్టిన పాట్నాకోర్టు

**పాట్నా,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ):** బిహార్‌లో పని చేస్తున్న సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌ను ఏపీ పోలీసులు అరెస్ట్ చేయడాన్ని పాట్నా కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఎలాంటి ఎఫ్ఐఆర్, కేస్ డైరీ లేకుండా ఎలా అరెస్టు చేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. హైకోర్టు రక్షణ ఉన్నప్పటికీ సునీల్ నాయక్‌ను బలవంతంగా అరెస్ట్ చేయడాన్ని నిలదీసింది. పాట్నా హైకోర్టు చెప్పినప్పటికీ ఏపీ పోలీసులు రావడమేంటని ప్రశ్నించింది. 30 రోజుల వరకూ సునీల్ నాయక్‌ను అరెస్ట్ చేయొద్దంటూ ఆదేశాలు జారీ చేసింది. దీనిలో భాగంగా రఘురామకృష్ణరాజు కేసు విషయానికి సంబంధించి సునీల్ నాయక్‌ను ట్రాన్సిట్ రిమాండ్‌ను పాట్నా సివిల్ కోర్టు తిరస్కరించింది. బలవంతపు అరెస్టును బిహార్ లాయర్లు తీవ్రంగా ఖండించారు. ఏపీ పోలీసులు గోడదూకి మరీ అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. బిహార్ పోలీసులు సైతం.. ఏపీ పోలీసుల తీరును తప్పుబట్టారు. సునీల్ నాయక్ గతంలో ఆంధ్రప్రదేశ్‌లో డిప్యూటేషన్‌లో పని చేశారు. ఈ క్రమంలోనే రఘురామకృష్ణరాజు కేసు విషయంలో ఆరోపణలు వచ్చాయి. అయితే తాజాగా సునీల్ నాయక్‌ను ఏపీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఏపీ సీఐడీ పోలీసులు.. సునీల్ నాయక్ నివాసానికి వెళ్లి అరెస్ట్ చేశారు. దీన్ని బిహార్ డీజీపీ కూడా తీవ్రంగా ఖండించారు. గోడదూకి వచ్చి తమ అధికారిని ఎలా అరెస్ట్ చేస్తారంటూ ప్రశ్నించారు.

# వికసిత బెంగాల్ బాధ్యత నాది!

## -ఆందోళన కలిగించేలా బెంగాల్లో చొరబాట్లు
## -బంగారు బంగ్లా కలలు సాకారం చేసుకుందాం
## -బెంగాల్ ప్రజలకు ప్రధాని మోదీ బహిరంగ లేఖ



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ):** పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరుగనున్న వేళ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బెంగాల్ ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితిపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరి కొద్ది నెలరోజుల్లో బెంగాల్ భవితను నిర్ణయించే కీలక ఎన్నికలు జరుగ నున్నాయని, భావితరాల భవిష్యత్తును నిర్ణయించే ఈ ఎన్నికల్లో ప్రజలు వివేకవంతమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. బంగారు బంగ్లా కలల సాకారానికి తాను భరోసా ఇస్తున్నానని అన్నారు. జై మహాకాళి' అంటూ ప్రధాని తన లేఖను ప్రారంభించారు. 'మరి కొద్ది నెలల్లోనే బెంగాల్ భవిష్యత్తు నిర్ణయం కోబోతోంది. మీరు తీసుకునే తెలివైన నిర్ణయం పైనే భావితరాల భవిష్యత్తు, దిశానిర్దేశర ఆధారపడి ఉంటుంది. సోనార్ బంగ్లా కోసం యువకులు, పెద్దలు, మహిళలు కన్న కలలు కల్లలుగా మిగిలిపోతున్న పరిస్థితి ఇవాళ ఉంది. వారి బాధలు నన్ను కలిచివేస్తున్నాయి. ఇందుకోసం హృదయపూర్వకంగా ఒక తీర్మానం చేసుకున్నాను. వికసత్ బంగ్లా సాధనకు నిర్ణయం తీసుకున్నాను' అని ఆ లేఖలో మోదీ పేర్కొన్నారు. గత 11 ఏళ్లుగా దేశ ప్రజల ఆశీస్సుల బలంతో ప్రజాసంక్షేమానికి, దేశ సర్వతో ముఖాభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం పాటుపడిందని, రైతుల సంక్షేమం నుంచి యువత కలల సాకారం, మహిళా సాధికారత వరకూ కృషి చేసిందని చెప్పారు. ప్రభుత్వ విధానాల వల్ల సాధించిన సానుకూల ఫలితాలను ఇవాళ ప్రజలు చూస్తున్నారని అన్నారు. బెంగాల్ అభివృద్ధి విషయంలో మమతాబెనర్జీ ప్రభుత్వం సహాయ నిరాకరణ చేస్తోందని మోదీ ఆ లేఖలో విమర్శించారు. అయినప్పటికీ ప్రజా సంక్షేమానికి కట్టుబడి కేంద్రం ముందుకు వెళ్తోందన్నారు. 'జన్-ధన్ యోజన'తో మిగతా 2లో..

రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్ కేసులో

# బీహార్‌లో ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ అరెస్ట్



**అమరావతి,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ):** రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీ, ప్రస్తుత ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజును కస్టడీలో వేధించినట్లు నమోదైన 'థర్డ్ డిగ్రీ' కేసులో కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌ను బీహార్‌లో ఏపీ పోలీసులు అరెస్టు చేశారు. బీహార్ కేడర్‌కు చెందిన సునీల్ నాయక్.. వైసీపీ హయాంలో డిప్యూటేషన్‌పై సీఐడీలో పనిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన బీహార్ వెళ్లిపోయారు. రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసులో సునీల్ పాత్రపై ఫిర్యాదు చేయడంతో విచారణకు రావాలని ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌ను ఆంధ్రప్రదేశ్ పోలీసులు పట్నాలో అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం బిహార్ రాష్ట్రంలో ఐజీగా విధులు నిర్వహిస్తున్న సునీల్ నాయక్‌ను పట్టుకునేందుకు ఏపీ పోలీసుల బృందం పట్నా వెళ్ళింది. గత కొంతకాలంగా ఈ కేసులోమిగతా 2లో..

# ఉగాదికి జాబ్ క్యాలెండర్ విడుదల

## -డీఎస్సీ కూడా అందులోనే ఉంటుంది
## -ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి లోకేశ్ సమాధానం

**అమరావతి,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ):** రాష్ట్రంలోని నిరుద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న జాబ్ క్యాలెండర్‌ను ఉగాది పండుగ సందర్భంగా విడుదల చేస్తామని మంత్రి లోకేశ్ ప్రకటించారు. ఈ జాబ్ క్యాలెండర్‌లోనే డీఎస్సీ పోస్టులను కూడా చేర్చనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా 8వ రోజు ప్రశ్నోత్తరాలు సందర్భంగా రాష్ట్రంలోని విద్యావ్యవస్థ, నిరుద్యోగుల సమస్యలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి నారా లోకేశ్ సమాధానమిచ్చారు. ఇది ఉపాధ్యాయ వృత్తిని ఆశించే వేలాది మంది అభ్యర్థులకు పెద్ద ఊరటనిచ్చే అంశం. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల పనితీరుపై ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, ఎమ్మెల్యే మురళీ మోహన్ పలు అంశాలను ప్రస్తావించారు. ఏపీలో కేజీబీవీ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతితో పాటు ఇంటర్మీడియట్ కూడా అందిస్తున్నారని, ఇక్కడ పనిచేస్తున్న వారికి ఎంటిఎస్ అమలు చేయాలని, రెగ్యులర్ ప్రిన్సిపాళ్లను మిగతా 2లో..

# సత్ప్రవర్తన ఖైదీలకు క్షమాభిక్ష

## -ప్రభుత్వం సానుకూలంగా ఉందన్న హోంమంత్రి
## -జైళ్లు, సంస్కరణల చట్టం సవరణపై బిల్లుపై అనిత



**అమరావతి,ఫిబ్రవరి23 (ఆర్ఎన్ఎ):** జైలులోని ఖైదీలకు క్షమాభిక్ష విషయంలో కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. సోమవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆమె మాట్లాడారు. జైళ్లు, సంస్కరణల చట్టం సవరణపై బిల్లును అసెంబ్లీలో హోంమంత్రి అనిత ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ.. ఖైదీల సంస్కరణల కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కేంద్రం తెచ్చిన చట్టం మేరకు ఇక్కడ కూడా సంస్కరణలు అమలు చేస్తున్నామన్నారు. ఖైదీలు జైలులో ఉండి చదువుకునేలా అవకాశాలను మెరుగుపరుస్తు న్నామని చెప్పారు. ఖైదీల్లో పరివర్తన తీసుకురావటం కోసం చట్టంలో మార్పులు తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా ఖైదీల పిల్లల కోసం జైలులో ప్రత్యేకంగా అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఖైదీల నేరచరిత్ర, ప్రవర్తన ఆధారంగా కేటగిరీలుగా విభజిస్తామని పేర్కొన్నారు. ఖైదీలు మారేందుకు, మానసిక పరివర్తన తెచ్చేలా మిగతా 2లో..

# అనూరియా వ్యాధిపై ఇంటింటి సర్వే

## 73 శాంపిల్స్ సేకరించి పరీక్షలకు అందచేత
## నలుగురు మృతి.. 12 మందికి ఆస్పత్రుల్లో చికిత్స
## అధికారులతో కలసి సమీక్షించిన కలెక్టర్ కీర్తి
## తక్షణ చర్యలకు సీఎం చంద్రబాబు ఆదేశం




**రాజమహేంద్రవరం, ఫిబ్రవరి23 (ఆర్ఎన్ఎ):** అనూరియా వ్యాధితో రాజ మహేంద్రవరంలో ఆసు పత్రుల్లో మరణించిన వారి సంఖ్య నాలుగుకు చేరిందని జిల్లా కలెక్టర్ చేకూరి కీర్తి వెల్లడించారు. నగరంలోని వివిధ ప్రైవేట్ ఆసుపత్రుల్లో 12 మంది చికిత్స పొందుతున్నారని ఆమె తెలిపారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఇంటింటా సర్వే నిర్వహించి 73 శాంపిల్స్ సేకరించామని వివరించారు. అలాగే పాల వ్యాపారికి చెందిన 42 గేదెల నుంచి పాలు సేకరించి.. ఆ శాంపిల్స్‌ను కూడా హైదరాబాద్ ల్యాబొరేటరీలకు పంపా మన్నారు. రాజ మహేంద్రవరంలో చోటు చేసుకున్న అనూరియా అంటే మూత్రం నిలిచిపోవడంపై జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ ఘటనకు సంబంధించిన అంశాలను ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి కీలక ఆదేశాలు జారీ చేశారు. ెూజమహేంద్రవరంలోని లాలాచెరువు సమీపంలోని చౌడేశ్వరినగర్ పరిసర ప్రాంతాల్లో ఫిబ్రవరి 15 నుంచి పలువురు వాంతులవడం, మిగతా 2లో..

# కాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్

## -ముగ్గురు జైషే ఉగ్రవాదుల హతం

**శ్రీనగర్,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ):** జమ్మూకశ్మీర్ లోని కిస్ట్‌వార్ జిల్లాలో భద్రతాబలగాలకు, ఉగ్రవాదులకు మధ్య భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఆ ఉగ్రవాదులు పాకిస్థాన్‌కు చెందిన జైష్ ఎ మహమ్మద్ కోసం పనిచేస్తున్నారని భద్రతాబలగాలు గుర్తించాయి. మంచుతో నిండిన ఛత్రూ అడవుల్లో ఓ కొండ దిగువన గల మట్టి ఇంట్లో ఉగ్రవాదులు దాగి ఉన్నారన్న కచ్చితమైన సమాచారం అందుకున్న భద్రతాబలగాలు.. ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి ఆ స్థావరాన్ని చుట్టుముట్టాయి. భద్రతాబలగాలు లొంగిపోవాలని హెచ్చరించగా.. తొలుత ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దాంతో భద్రతాబలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఆ ఇంట్లో దాగి ఉన్న ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. మృతి చెందిన ఉగ్రవాదుల్లో కరుడుగట్టిన ఉగ్రవాది, జేఈఎం కమాండర్ సైఫుల్లా కూడా ఉన్నట్టు అనుమానిస్తున్నారు.



# నేపాల్లో లోయలో పడ్డ బస్సు: 18 మంది మృతి

**ఖాట్మండ్,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ):** నేపాల్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ధాడింగ్ జిల్లాలో ఓ ప్రయాణికుల బస్సు లోయలో పడి 18 మంది మృతిచెందారు. మరో 28 మంది గాయపడ్డారు. పొఖారా నుంచి కాఠ్‌మాండూ వెళ్తుండగా సోమవారం తెల్లవారుజామున ఈ దుర్ఘటన జరిగింది. బస్సు అదుపుతప్పి త్రిశూలీ నదిలోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో బస్సులో 45 మందికి పైగా ప్రయాణికులున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో విదేశీయులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదానికి కారణాలు ఇంకా తెలియరాలేదు. అయితే, అతివేగం వల్లే ఈ ఘటన జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

# తమినాడులో సర్ ప్రక్రియ పూర్తి

## 74 లక్షల మందిఓటర్ల తొలగింపు

**చెన్నై,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ):** తమిళనాడు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ప్రక్రియ పూర్తికావడంతో తుది జాబితాను ఎన్నికల సంఘం సోమవారంనాడు విడుదల చేసింది. సవరించిన జాబితా కింద రాష్ట్రంలోని 74 లక్షల మందిని ఓటర్ల జాబితా నుంచి ఈసీ తొలగించింది. మొత్తం 5.67 కోట్ల మంది ఓటర్ల బాజితాలో చోటుచేసుకున్నారు. ఎస్ఐఆర్ పక్రియకు ముందు 6.41 కోట్ల మంది రిజిస్టర్డ్ ఓటర్లు ఉన్నారు. సోమవారంనాడు చెన్నైలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తమిళనాడు చీఫ్ ఎలక్షన్ అధికారి అర్చనా పట్నాయక్ ఈ జాబితాను విడుదల చేశారు. తాజా జాబితాలో 5.67 కోట్ల మంది ఓటర్లు నమోదు కాగా, 2.77 కోట్ల మంది పురుషులు, 2.89 కోట్ల మంది మహిళలు 7,617 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారు. అబ్జెక్షన్ పీరియడ్‌లో దాఖలు చేసిన దరఖాస్తులను సమీక్షించి మార్పులు చేసినట్టు ఎన్నికల కమిషన్ తెలిపింది. తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్, పుదుచ్చేరి, అస్సాం ఎన్నికలు కూడా ఈ వేసవిలో జరగాల్సి ఉన్నాయి.

# మరోమారు భారీగా పెరిగిన బంగారం ధరలు

## -అంతర్జాతీయ పరిణామాలే కారణమన్న నిర్మలా సీతారామన్



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ):** దేశీయ మార్కెట్లో విలువైన లోహాల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. సోమవారం ట్రేడింగ్‌లో వెండి ధర ఏకంగా కిలోకు రూ.15,000 పైగా పెరగగా, బంగారం ధర 10 గ్రాములకు రూ.3,000 పైగా ఎగబాకింది. ఈ అసాధారణ పెరుగుదలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందిస్తూ.. పెట్టుబడిదారులకు మరియు వినియోగదారులకు కీలక విషయాలు వెల్లడించారు.. ఆర్బీఐ బోర్డు సమావేశం అనంతరం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. బంగారం, వెండి ధరల పెరుగుదల వెనుక ఉన్న అంతర్జాతీయ పరిణామాలను వివరించారు.. కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు.. గతంలో కేవలం భారత్, చైనా డిమాండ్ వల్లే ధరలు పెరిగేవి. కానీ, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని దేశాల కేంద్ర బ్యాంకులు భారీగా బంగారాన్ని కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నాయి. ఇదే ప్రస్తుత పెరుగుదలకు ప్రధాన కారణం అని వెల్లడించారు. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు మరియు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న కొత్త సుంకాల హెచ్చరికల వల్ల స్టాక్ మార్కెట్లు అస్థిరంగా ఉన్నాయి. దీంతో సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు ఇన్వెస్టర్లు మొగ్గు చూపుతున్నారని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. భారత్ తన బంగారం అవసరాల కోసం పూర్తిగా దిగుమతులపైనే ఆధారపడుతోంది.. దేశీయంగా తగినంత వెలికితీత వనరులు లేకపోవడం కూడా ధరలపై ప్రభావం చూపుతోందని వెల్లడించారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. తాజా ధరల వివారల్లోకి వెళ్తే.. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.3,724 పెరిగి.. రూ.1,60,600కి చేరింఇ.. ఇదే సమయంలో కిలో వెండి ధర రూ.15,931 పెరిగి రూ.2,68,875కు ఎగబాకింది.. అయితే, బంగారం, వెండి ధరల పెరుగుదలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ఆర్బీఐ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోంది. కొనుగోళ్లు ఇంకా పరిమితి దాటలేదు‘ అని ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు

లక్ష్యంపై ఉన్నతం శ్రద్ధాసక్తుల్ని, లక్ష్య సాధనలో సైతం చూపించాలి, విజయ రహస్యమంతా ఇదే. పరాజయాలను పట్టించుకోకండి, అవి సర్వ సాధారణం, అవే జీవితానికి మెరుగులు దిద్దేవి.

## టీటీడీకి రూ.10 లక్షలు విరాళం



**తిరుమల,ఫిబ్రవరి 23 (నేటి మనదేశం ప్రతినిధి):** హైదరాబాద్ కు చెందిన సాతకూరి తాండవ కృష్ణ మూర్తి అనే భక్తుడు సోమవారం టీటీడీ శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.10,01,116 విరాళాన్ని అందించారు. ఈ మేరకు దాత తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు.

## అంగన్వాడీల రిలే దీక్షలు

**శ్రీకాళహస్తి రూరల్, ఫిబ్రవరి 23 (నేటి మనదేశం ప్రతినిధి):** ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు అంగన్వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న ప్రతి ఒక్క సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి సుమారు 20 నెలలు కాలం గడిచినప్పటికీ అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకపోవడం ఎంతో దుర్మార్గమని సి.ఐ.టి.యు జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని స్థానిక ఐ.సి.డి.ఎస్ కార్యాలయం ఎదుట సోమవారం ప్రజా సంఘాలైన సి.ఐ.టి.యు, ఐ.ఎఫ్.టి.యు ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సి.ఐ.టి.యు నాయకులు పెనగడం గురవయ్య మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ పల్లె, పట్టణం అనే తేడా లేకుండా పోషక ఆహారం, శిశువుల ఆరోగ్యం, పిల్లల పోషణ స్థాయిని పెంచి పిల్లల శారీరక మానసిక పెరుగుదలకు బాటలు వేసే అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించ డంలో విఫలమవుతున్నారని అన్నారు. ఈనెల 25, 26, 27వ తేదీలలో జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట రిలే దీక్షలు చేపడుతా మని అన్నారు. కార్యక్రమంలో సి.ఐ.టి.యు నాయకులు గంధం మణి, రాజా, రేవతి, పుష్ప, సక్కుబాయి,ఐ.ఎఫ్.టి.యునాయకులుజాకీర్,కల్పన పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి భూమి పూజ



**తొట్టంబేడు, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తొట్టంబేడు మండలం కత్తి వారి కండ్రిగ దళితవాడలో గుర్రప్ప స్వామి ఆలయ నిర్మాణానికి మాజీ శాసనసభ్యులు ఎస్ సి వి నాయుడు భూమి పూజ నిర్వహించారు. కత్తి వారి కండ్రిక గ్రామంలో శ్రీ గుర్రప్ప స్వామి ఆలయాన్ని నిర్మించాలని గ్రామస్తులు నిర్ణయించి ఆలయ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే ఎస్ సి వి నాయుడు సహకారాన్ని అభ్యర్థించారు. నూతన గురప్ప స్వామి ఆలయ నిర్మాణానికి ఎస్సివి నాయుడు తనవంతు సహాయ సహకారాలు అందించారు. సోమవారం ఆలయ నిర్మాణం భూమి పూజకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్సివి నాయుడుకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. సాంప్రదాయ పద్ధతిలో ఆలయ నిర్మాణానికి భూమి పూజ ఎస్సివి నాయుడు చేతుల మీదుగా నిర్వహింపజేశారు. పరమేశ్వరుడు వివిధ రూపాల్లో ఉంటాడని గుర్రప్ప స్వామి పరమేశ్వరునీ ప్రతిరూపమని, గ్రామాలు ఆధ్యాత్మిక చింతనతో వర్ధిల్లాలని అప్పుడే ప్రజలు సుఖశాంతులతో ఉంటారని ఎస్సివినాయుడు అన్నారు. కార్యక్రమంలో స్థానిక గ్రామస్థులు పాల్గొన్నారు.

## అయోడిన్ లోప నివారణపై సర్వే

**చంద్రగిరి, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జాతీయ అయోడిన్ లోప నివారణా కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా ఆరోగ్య శాఖ పర్యవేక్షణలో గంగుడుపల్లి, మల్లయ్యపల్లి గ్రామాల్లో పిల్లలకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షల సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సుమారు 100 మంది విద్యార్థులను పరీక్షించి, వారి ఆరోగ్య స్థితిగతులను సమీక్షించారు. సర్వేలో భాగంగా విద్యార్థుల నుంచి యూరిన్ శాంపిల్స్‌ను సేకరించారు. అదేవిధంగా వారు ఇళ్లలో నిత్యం వాడుతున్న ఉప్పు నమూనాలను కూడా సేకరించి, వాటిలో అయోడిన్ శాతం ఎంత ఉందో విశ్లేషించడానికి జిల్లా కేంద్రంలోని ల్యాబొరేటరీకి పంపారు. అయోడిన్ లోపం వల్ల కలిగే శారీరక, మానసిక సమస్యల పట్ల గ్రామస్థులకు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖకు చెందిన ప్రముఖవైద్యులు: డాక్టర్ బొల్లినేని కుసుమ, డాక్టర్ రాసినేని శిరీషతో పాటుఆరోగ్య సిబ్బంది: శివరాజు, వాసుదేవ రెడ్డి, దీపికా, ఏఎన్ఎంలు శివకుమారి, సంధ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. సర్వే విజయవంతం కావడానికి సహకరించిన పాఠశాల యాజమాన్యాలకు, తల్లిదండ్రులకు వైద్య బృందం ధన్యవాదాలు తెలిపారు.

## కందుల భార్గవికి వైవీయూ పీహెచ్‌డి



**కడప,ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** యోగి వేమన విశ్వ విద్యాల యం భౌతిక శాస్త్రంలో కందుల భార్గవి కి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ(పీహెచ్‌డీ) డిగ్రీ ప్రదానం చేసింది. "ప్రాంతీయ స్థాయి నుంచి ప్రపంచ స్థాయి వరకు కరువు గమనికలు, వాతావరణ అనుసం ధానాల ప్రభావాలపై స్థల, కాల విశ్లేషణ" శీర్షిక తో ఆమె డాక్టరేట్ పరిశోధనను విశ్వవిద్యాలయంలోని భౌతిక శాస్త్ర విభాగానికి చెందిన సెమీ,అరిడ్ జోనల్ అట్మాస్ఫెరిక్ రీసెర్చ్ సెంటర్ (ఎస్ఏఆర్‌సి)లో ప్రొఫెసర్ కె.కృష్ణా రెడ్డి మార్గదర్శకత్వంలో నిర్వహించారు.ఈ పరిశోధనలో 1961 నుంచి 2021 వరకు దీర్ఘకాలిక కాలవ్యవధిలో రాయలసీమ ప్రాంతం, భారతదేశంలోని ఎండ, అర్ధ ఎండ ప్రాంతాలు, అలాగే ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎండ ప్రాంతాల్లో కరువు మార్పులను సమగ్ర శాస్త్రీయంగా విశ్లేషించారు. 2019లో తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నుంచి భౌతిక శాస్త్రంలో ఎం.ఎస్.సి డిగ్రీ సాధించారు. ఆమె తన ప్రాంతం నుంచి పీహెచ్‌డీ పొందిన మొదటి వ్యక్తిగా గుర్తింపు పొందారు.

## ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలి: జేసీ

**పుట్టపర్తి, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేలా త్వరితగతిన నాణ్యతగా పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలు నందు... ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం మౌర్య భరద్వాజ్, డిఆర్వో సూర్యనారాయణ రెడ్డి, ఆర్డీఓ సువర్ణ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ గారు మాట్లాడుతూ.. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు.. క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు.

## శ్రీవారి పుష్కరిణిలో తెప్పోత్సవాల ట్రయల్ రన్



**తిరుమల, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుమలలో ఫిబ్రవరి 26 నుండి మార్చి 2 వరకు సాలకట్ల తెప్పోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో సోమవారం సాయంత్రం స్వామి పుష్కరిణిలో తెప్పల ట్రయల్‌రన్ నిర్వహించారు. టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి ఈ కార్యక్రమంలో పాల్గొని ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు ఈవో మీడియాతో మాట్లాడుతూ తెప్పోత్సవాలకు తెప్పలను పూర్తిగా సిద్ధం చేసినట్టు తెలిపారు. ఇంజినీరింగ్, విద్యుత్, ఆలయ అధికారులతో కలిసి తెప్ప సామర్థ్యాన్ని పరిశీలించినట్లు చెప్పారు. తొలిరోజు శ్రీసీత లక్ష్మణ ఆంజనేయ సమేతంగా శ్రీరామచంద్రమూర్తి, రెండో రోజు రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామివారు తెప్పలపై విహరిస్తారని వివరించారు. చివరి మూడురోజులు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామివారు తెప్పలపై భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. మొదటి మూడు రోజులు మూడుసార్లు, 4వ రోజు ఐదుసార్లు, చివరిరోజు ఏడుసార్లు తెప్పలపై ఉత్సవ మూర్తులు విహరించి భక్తులను అనుగ్రహిస్తారని చెప్పారు. కాగా తెప్పోత్సవాల కారణంగా ఫిబ్రవరి 26, 27 తేదీల్లో సహస్రదీపాలంకార సేవ, ఫిబ్రవరి 28న, మార్చి 01, 02వ తేదీల్లో ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది. ఈ తెప్పోత్సవాల ట్రయల్ రన్‌లో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవోలోకనాథం, ఈఈలు శ్రీనివాసరావు,సుధాకర్, డిఈచంద్రశేఖర్, పాల్గొన్నారు.

## డిమాండ్ల సాధన కొరకు అంగన్వాడీల దీక్ష

**సత్యవేడు, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తమ డిమాండ్ల సాధన కొరకు సత్యవేడు ప్రాజెక్టు అంగన్వాడి కార్యకర్తలు సోమవారం మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు ప్రాజెక్టు అంగన్వాడి యూనియన్ కార్యదర్శి నిర్మల మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తమ సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన ధర్నా కార్యక్రమాలలో కూటమి పార్టీ మద్దతు తెలిపి తమ ప్రభుత్వం రాగానే పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్న అంగన్వాడీల సమస్యలు పరిష్కరించబడలేదని విమర్శించారు. ఇంతవరకు విడుదలైన బడ్జెట్లలో అంగన్వాడీల సంక్షేమానికి నిధులు కేటాయించకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా అంగన్వాడి కష్టాలను ప్రభుత్వం గుర్తించి ప్రస్తుత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈ దీక్ష ఇంతటితో ఆగదని అంచలంచలుగా జిల్లా రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తోందని హెచ్చరించారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు శాంతి కార్యకర్తలు ఇందిరా, భువన, దివ్య, ఝాన్సీ, మంజుల, లక్ష్మి, సత్యవేడు, వరదయ్యపాలెం మండలానికి చెందిన అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

**సత్యవేడు,ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సత్యవేడు మండలం కొత్తమారికుప్పం పంచాయతీ అమావాస్య రెడ్డి కండ్రిగ సమీపంలోని దేవాలయం వద్ద అక్రమంగా తరలించడానికి సిద్ధంగా ఉంచిన రేషన్ బియ్యం బస్తాలను స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యం అక్రమంగా దాచి ఉంచినట్టు ఎస్సై సాయినాథ్ చౌదరికి సమాచారం అందింది. దీంతో ఎస్ఐ సూచన మేరకు సత్యవేడు అడిషనల్ ఎస్ఐ లావణ్య ఆధ్వర్యంలో పోలీసుల బృందం అమావాస్య రెడ్డి కండ్రిగ దేవాలయం వద్దకు చేరుకొని తనిఖీలు నిర్వహించగా దాచి ఉంచిన రేషన్ బియ్యంబస్తాలు బట్టబయలయ్యాయి. ఇందుకు సంబంధించి నాయుడుపేటకు చెందిన మహిళ కల్పనాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం1500 కిలోలు ఉంటుందని ఎస్ఐ లావణ్య పేర్కొన్నారు. నిందితురాలు కల్పనాతో పాటు రేషన్ బియ్యం బస్తాలను పోలీస్ స్టేషన్ కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు. కాగా పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం తమిళనాడులోని ఊత్తుకోటకు చెందిన భాష అనే వ్యక్తిదని విచారణలో తేలిందన్నారు. సీజ్ చేసిన రేషన్ బియ్యం బస్తాలను తదుపరి చర్యల కోసం స్థానిక తహసిల్దారుకి అప్పగించామన్నారు.

## మిలిటరీ స్కూల్ ప్రవేశ పరీక్షలో 'శ్రీ దిన్నెపాటి బసిరెడ్డి వికాస్' విద్యార్థి ఘన విజయం



**చింతకొమ్మదిన్నె, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఇటీవల వెలువ డిన రాష్ట్రీయ మిలిటరీ స్కూల్ (ఆర్ఎంఎస్) ప్రవేశ పరీక్షా ఫలితాల్లో కడప భగత్ సింగ్ నగర్‌లో ఉన్న శ్రీ దిన్నెపాటి బసిరెడ్డి వికాస్ కోచింగ్ సెంటర్ విద్యార్థి అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ పరీక్షలో విద్యార్థి అఖిలేష్ రెడ్డి 200 మార్కులకు గాను 148 మార్కులు సాధించి, జాతీయ స్థాయిలో తన ప్రతిభను చాటుకున్నారు. ఈ సంద ర్భంగా సంస్థ కరస్పాండెంట్ శ్రీ దిన్నెపాటి బసిరెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన శిక్షణ, నిరంతర పర్యవేక్షణ వల్లే విద్యార్థులు ఇలాంటి జాతీయ స్థాయి పరీక్షల్లో విజయం సాధిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. కడప వంటి ప్రాంతం నుండి విద్యార్థులు మిలిటరీ స్కూల్స్ వంటి ప్రతిష్టాత్మక సంస్థ లకు ఎంపికవ్వడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. సంస్థ డైరెక్టర్ డి.శివకళ మాట్లాడుతూ అఖిలేష్ రెడ్డి సాధించిన ఈ విజయం తోటి విద్యార్థులకు స్ఫూర్తిదా యకమని, భవిష్యత్తులో మరిన్ని మెరుగైన ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈ విజయం సాధించిన విద్యార్థిని, అందుకు సహకరించిన ఉపాధ్యాయ బృందాన్ని తల్లిదండ్రులను వారు ప్రత్యేకంగా అభినందించారు.

## ప్రతి అర్జీని పరిశీలించి పరిష్కరించండి: జిల్లా కలెక్టర్



**కడప, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా అందిన అర్జీలను అధికారుల క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని సభా భవన్ సమావేశపు మందిరం నందు.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఇందులో జిల్లా జాయింట్ కలెక్టర్ డా.నిధి మీనా, డిఆర్వో విశ్వేశ్వర నాయు డు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధిక ప్రాధాన్యతను ఇచ్చి నిర్వహిస్తోందని, ఇందుకు అనుగుణంగా అధికారులు పనిచేయాలన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువు లోపు తప్పనిసరిగాపరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జడ్పి సిఇఓ ఓబుళమ్మ, డి.ఆర్.డి.ఏ. పి.డి. జి.రాజ్యలక్ష్మి, పర్యాటక శాఖ అధికారి సురేష్ కుమార్, కో–ఆపరేటివ్ శాఖ అధికారి వెంక టసుబ్బయ్య,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు: జిల్లా ఎస్పీ

**కడప, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు సోమవారం నుండి జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన ఇంటర్మీ డియట్ పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ అధికారులు పటిష్టమైన బందో బస్తు ఏర్పాట్లు చేపట్టారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమ లులో ఉన్నందున పరీక్షా కేంద్రాలు ఆవరణలో బయట వ్యక్తులు లేకుండా చర్యలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లను మూసివేయిం చేలా చర్యలు తీసుకున్నారు. జిల్లాలో జరుగుతున్న ఇంటర్ పరీక్షల సెంటర్ల వద్ద సిఐ లు, ఎస్ఐలతో పాటు, పోలీస్ సిబ్బందిని నియమించి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.సెంటర్ల వద్ద మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, తీసుకురాకుండా కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహించారు. అలాగే ప్రశ్నప త్రాల రవాణా భద్రతా పరంగా ప్రత్యేక ఎస్కార్ట్ ఏర్పాటు చేశారు. సెంటర్ల పరిసర ప్రాంతాలలో అనుమా నస్పద వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేసి ఎలాంటి ఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకున్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు, సంఘటనలు తలెత్తకుండా పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. విద్యార్థినీ విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ సూచించారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి: జిల్లా ఎస్పీ

**కడప, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లా పోలీస్ కార్యాలయంలో "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ పాల్గొని, జిల్లా నలుమూలల నుం డి వచ్చిన ప్రజల నుండి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మొత్తం 102 ఫిర్యాదులకు వచ్చాయి. ఈ సందర్భంగా ఎస్పీ, ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి, వాటిని పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులతో ప్రత్యక్షంగా ఫోన్‌లో మాట్లాడారు. చట్టపరమైన పరిమితులలో నిర్ణీత గడువులోపు వాటిని పరిష్కరిం చాలంటూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(పరిపాలన) కె.ప్రకాష్ బాబు మహిళా పోలీస్ స్టేషన్ డి.ఎస్పీ బాలస్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లా

## అంగన్వాడీల సమస్యలు పరిష్కరించేంతవరకు పోరాటం

### -ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపనేని హరికృష్ణ

**తిరుపతి, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలో అంగన్వాడీల సమస్యలను అధికారులకు వచ్చిన మూడు నెలల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు పట్టించుకున్న పాపాన పోలేదని, వారి సమస్యలు అన్ని పరిష్కరించే వరకు పోరాటం కొనసాగు తుందని ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపనేని హరికృష్ణ స్పష్టం చేశారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచాలనీ, గ్రాట్యుటీ, పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఐఎఫ్టియు, సిఐటియు, ఏఐటియుసి యూనియన్ల ఆధ్వర్యంలో నిరసన దీక్ష కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా తిరుపతిలో ఏపీ ప్రగతిశీల అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్(ఐఎఫ్టియు) ఆధ్వర్యంలో రాస్ కార్యాలయం ఎదుట నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, శిశువులు, పిల్లల ఆరోగ్యాలను కాపాడటంలో ఐసిడిఎస్ లక్ష్యాలను అంగన్వాడీలు ముందుకు తీసుకు వెళుతున్నారని, పాలకులు మాత్రం అంగన్వాడీల సమస్యల పరిష్కారం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదని విమర్శించారు. అతి తక్కువ వేతనాలతో వెట్టిచాకిరి చేస్తున్న అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. పని భారంపెంచి కనీస వేతనాలు మాత్రం అమలు చేయడం లేదని అన్నారు. ఉన్నత న్యాయస్థానాల మార్గదర్శకాల ప్రకారం గ్రాట్యుటి, పిఎఫ్, ఈఎస్ఐలు అమలు చేయాల్సి ఉందని, అంగన్వాడీలకు కనీస వేతనం 26 వేలు, వర్కర్లకు 20 వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చట్టం ప్రకారం అమలు చేయాలని పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ఏపీ ప్రగతిశీల అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్టియు) తిరుపతి నగర అధ్యక్షురాలు సుజాత కార్యదర్శి నాగరత్న, నాయకురాలు జె.గంగాదేవి మాట్లాడుతూ పోరాటంలో భాగంగా ఈనెల 23 నుండి 27 వరకు రేలే నిరాహార దీక్షలు చేపడతామని ప్రభుత్వం స్పందించకుంటే మార్చి 2న విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తామన్నారు. ఐఎఫ్టియు సీనియర్ నాయకులు పి వెంకటరత్నం మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి ముందు హామీలు ఇవ్వడం ఆ తరువాత నిర్లక్ష్యం చేయడం పాలకులకు పరిపాటిగా మారిన నేపథ్యంలో పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని పాలకులను నిలదీయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ సమావేశంలో ఏపీ ప్రగతిశీల అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(ఐఎఫ్టీయు) తిరుపతి నగర అధ్యక్షురాలు సుజాత, కార్యదర్శి నాగరత్న, నాయకురాళ్లు ఎం.అరుణ, జె.గంగాదేవి, శశికళ, విమల, అరుణ, ఐఎఫ్టీయు నాయకులు రమేష్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి రాణి, ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కుడుం విజయ్ కుమార్, నాయకుడు ముని కుమార్ పిడిఎస్యు నాయకుడు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఓర్పు, సహనానికి ప్రతీక రంజాన్



**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఓర్పు సహనానికి ప్రతీక రంజాన్ నెల అని జామియా మస్ జిద్ పేష్ ఇమామ్ హాఫీజే ఖురాన్ రెహాన్ సాహెబ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం మిగిలిన 11 మాసాల కన్నా భిన్నమైనదన్నారు. ఈ మాసంలో మానవుడు ఆచరించాల్సిన నాలుగు సూత్రాలకు అవకాశం ఉందన్నారు. అలాగే మనం తెలిసి తెలియక చేసిన తప్పులు తప్పిదాల్ని శరణుగోరి క్షమాపణ కోరుకుంటే అల్లాహ్ క్షమిస్తాడన్నారు. ఈ మాసంలో దానాలు చేసి ముక్తి పొందవచ్చునన్నారు. ఒక దానానికి 70 రెట్లు ఎక్కువ లబ్ధి లభిస్తుందన్నారు. జకాత్ ద్వారా తమ సంపాదనను అధికారికం చేసుకోవచ్చునని వివరించారు. ఈ మాసంలో దానాలు చేస్తే ఎంతో పుణ్యం వస్తుందన్నారు. మసీదులు, మదరసాల అభివృద్ధికి ముస్లిం యువకుల చేయుత వర్ణనా తీతం అన్నారు. ఈ మాసంలో యువకులు ,వృద్ధులు ఎండల్ని సైతం లెక్క చేయక ఉపవాస దీక్షలు పాటించాలన్నారు. ఇది క్రమశిక్షణకు పట్టుదలకు దేవునిపై నమ్మకానికి నిదర్శనం అన్నారు.

## హిజ్రాలకు ఐడి కార్డుల పంపిణీ

**అనంతపురం, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం అనంతపురంకు చెందిన యస్.శాంతి, కూడేరుకు చెందిన హిజ్రాలు హెచ్.ఆద్యాకు ఐడి కార్డులను, హిజ్రా సర్టిఫికెట్లను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న హిజ్రాలు అందరికి తక్షణమే ఐడి కార్డులు మంజూరు కాబడుతాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఏ.మలోల, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు అర్చన, సిబ్బంది పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు: ఎమ్మెల్యే



**గూడూరు, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్ ఎన్నికల హామీలలో గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని ఇచ్చిన హామీ ప్రకారం నెల్లూరు జిల్లాలో కలిపినందుకు సభా ముఖంగా కృతజ్ఞతలు తెలుపుతున్నానని అసెంబ్లీ జీరో అవర్‌లో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు అభివృద్ధికి గతంలో 2017లో చంద్రబాబు నాయుడు చొరవతో రూ.18 కోట్లతో పంబలేరు బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టామన్నారు. గత ప్రభుత్వం కాలాయాపన చేస్తూ 2024 బ్రిడ్జ్ ఒక్కటే పూర్తి చేసిందని, బ్రిడ్జ్‌కి ఇరువైపులా వాల్ ప్రొటెక్షన్, ఎక్స్‌టెన్షన్ రోడ్లు వేస్తే బ్రిడ్జ్ ప్రజలకు అందుబాటులోకి వస్తుందని అన్నారు. ఇటీవల ఆర్ అండ్ బి శాఖ మంత్రి జనార్దన్ రెడ్డి సూపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గూడూరు పర్యటన విచ్చేసినపుడు బ్రిడ్జ్‌ను పర్యవేక్షించి అధికారులను డిటైల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ అందించమని తెలిపారు. బ్రిడ్జ్ పూర్తి వివరాలు మంత్రికు అందించున్నామని తెలిపారు. బ్రిడ్జ్ పనులు పూర్తి కావాలంటే రూ.9 కోట్లు నిధులు అవసరమవుతున్నాయని ఆ నిధులు మంజూరు చేసి గూడూరు పట్టణ ప్రజల కలను నెరవేర్చాలని సభా ముఖంగా కోరుతున్నాని ఎమ్మెల్యే తెలిపారు.

## పేదల సొంతింటి కళను నెరవేరుస్తున్న ప్రభుత్వం



**నగరి, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కో ఇంటి నిర్మాణంకు రు.2.50 లక్షలు నిధులు మంజూరు చేశారు. నగరి మున్సిపాలిటీకు మొదటి విడతలో 454 ఇండ్లు మంజూరు ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పత్రాలు అందజేసారు.మున్సిపాలిటీ నందు ఇండ్ల నిర్మాణం ప్రారంభమైనందుకు లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## నడి రోడ్డుపై పారుతున్న నీరు



**నగరి,ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి కొత్తపేట లోని మైన్ రోడ్ నందు రామర్ భజన గుడి ఎదురుగా తాగునీరు వృథా లీకేజీ రెండు నెలలుగా రోడ్డుపై ప్రవహిస్తున్నది. దీనివలన రోడ్డు గుంతలుగా ఏర్పడి పాడై పోవడం వలన వాహన దారుల ప్రమాదలకు గురవుతున్నారు. ఇటీవల 20వ తారీకున కూడా ఈ ప్రదేశంలో రెండు బైక్ ఢీకొని గాయపడిన వారిని ఆంబులెన్సులు తరలించారు. పాదచారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కావున అధికారులు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# స్వర్ణనంది అవార్డు అందుకున్న డాక్టర్ మురుగన్



**పలమనేరు, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని ప్రసాద్ ల్యాబ్ ఆడిటోరియంలో ఆదర్శ కళా నిలయం చైర్మన్ ప్రకాష్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి 9 గంటలకు సినిమా, టీవీ నటులు రాజేంద్ర, నగేష్ ప్రీతీ, కీర్తి, శృతి చౌదరి, నిర్మాతలు నిరంజన్, రాందాస్ నాయుడు డైరెక్టర్ విశ్వంతో పాటు పలమనేరు పట్టణం ఘంటా ఊరుకు చెందిన తిరుపతి గంగమ్మ గుడి చైర్మన్, డాక్టర్ ఆర్.మురుగన్‌ను కూడా ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఇంకా ఎంతో మందికాళాకారుల ముఖ్య అతిధులుగా ఆహ్వానించి నిర్వహించిన సమావేశంలో స్వర్ణ నంది అవార్డు ప్రదానం చేయడం జరిగిందన్నారు. ఇంతమంది అతిరథ మహారథుల తో పాటునాకుస్వర్ణ నంది అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు. 2014 నుంచి సినిమా నటులకు కూడా నంది అవార్డు ఇవ్వడం ప్రభుత్వం నిలిపి వేసిందని ఇలాంటి తరుణంలో సినిమా నటులతో పాటు సామాజిక సేవలశీదిస్తున్న మా లాంటి వారిని కూడా గుర్తించి ఈ అవార్డు ఇవ్వడం మాకు పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామన్నారు. అవార్డు అందుకున్నందుకు పట్టణంలోని ప్రజలు స్నేహితులు అభిమానులు వర్షం వ్యక్తం చేశారు.

## ప్రజా వేదికలో అర్జీల వెల్లువ నిర్లక్ష్యం సహించబోమని ఎమ్మార్వో హెచ్చరిక



**రామసముద్రం, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజలు భారీగా తరలివచ్చారు. ఎమ్మార్వో మహమ్మద్ అజారుద్దీన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు, బాధితులు తమ గోడులను వినిపించగా 8 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. పీజీఆర్ఎస్‌లో నాలుగు అర్జీలు నమోదు అయ్యాయని వెల్లడించిన ఆయన, గత సోమవారం వచ్చిన 15 ఫిర్యాదుల్లో 13 ఇప్పటికే పరిష్కరించామని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆలస్యం అస్సలు సహించబోమని, అధికారులు తక్షణ స్పందనతో చర్యలు తీసుకోవాలని ఎమ్మార్వో స్పష్టం చేశారు.

## గంగమ్మకు హుండీ ద్వారా రూ.59.35 లక్షల ఆదాయం



**చౌడేపల్లి,ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బోయకొండ గంగమ్మకు హుండీ ద్వారారూ రూ.59,35,839 ఆదాయం వచ్చినట్లు ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం తెలిపారు. సోమవారం కొండపై జరిగిన లెక్కింపులో 45 రోజులకు గాను నగదుతో పాటు 38 గ్రాముల బంగారం, 155 గ్రాముల వెండి భక్తులు అమ్మవారికి కానుకూల రూపంలో సమర్పించారు. అదేవిధంగా రణభేరి గంగమ్మ ఆలయంలో గల హుండీ ద్వారా రూ.34,024, అన్నదాన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.13,495 ఆదాయంగా సమకూరిందన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ, పోలీసు, దేవస్థానం, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనదారులకు జరిమానా



**పలమనేరు, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణ సమీపంలోని ద్విచక్ర వాహనలను అర్బన్ ఎస్ఐ లోకేష్ రెడ్డి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వాహనాలతో పాటు ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసి రికార్డులు లేని వాహనాలకు జరిమానా విధించారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా లైసెన్సు, ఇన్సూరెన్స్ దానికి సంబంధించిన రికార్డులు సక్రంగా ఉండాలన్నారు. అదేవిధంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కూడా తనకి నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు నిబంధనలను తప్పక పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర ఏ 2047 క్యాలెండర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

**అనంతపురం, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ(ఐ.అండ్.పీఆర్) ఆధ్వర్యంలో 2026వకి సంబంధించిన స్వర్ణాంధ్ర ఏ 2047 క్యాలెండర్ లను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంపన్న, ఆరోగ్యవంత, సంతోషకరమైన రాష్ట్రం సాధన లక్ష్యంగా 2026కి సంబంధించిన స్వర్ణాంధ్ర ఏ 2047 క్యాలెండర్ లను రూపొందించడం జరిగిందని తెలిపారు. పది సూత్రాలు ఒక విజన్ అని, అందులో పేదరిక నిర్మూలన, అన్ని దశల్లో సమగ్ర సాంకేతికత, స్వచ్ఛంధ్ర, నాణ్యమైన ఉత్పత్తులు, విద్యుత్తు ఇందన రంగంలో వ్యయం తగ్గింపు, ప్రపంచ స్థాయి రవాణా వ్యవస్థ, వ్యవసాయంలో సాంకేతికత, నీటి భద్రత, నైపుణ్యం, మానవ వనరుల అభివృద్ధి, ఉపాధి, ఉద్యోగాల కల్పన ముఖ్యమైనవన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ బంగారు భవిష్యత్తు కోసం విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డిఆర్ఓ ఏ.మలోల, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, ఆర్డీఓలు కేశవనాయుడు, ఎస్డీసిలు రామ్మోహన్, పద్మావతి, ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ ఏ.బాలకొండయ్య, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేస్తాం!

### - ఏపిడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ హామీ



**చిత్తూరు, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హామీ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ తన ఛాంబర్‌లో ఏపీడబ్ల్యూజేఎఫ్ డైరీ-2026ను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉన్న జర్నలిస్టులకు తగిన సహాయ సహకారాలు అందిస్తామని వివరించారు. కేబుల్ టీవీలు, చిన్న, వార, పక్ష, మాస పత్రికలకు ప్రభుత్వ జీవో ప్రకారం అక్రిడిటేషన్లను జారీ చేయడంలో తగిన ప్రాధాన్యత ఇస్తామని వివరించారు. పోలీస్ కేసుల విషయంగా ఎఫ్ఐఆర్‌నే ప్రామాణికంగా తీసుకోకుండా కేసు తీవ్రతను బట్టి అక్రిడిటేషన్ల మంజూరు విషయంలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ క్రమంలో అక్రిడిటేషన్ జారీలో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు కవరకుంట్ల జయరాజ్ జిల్లా కలెక్టర్‌కు వివరించారు. చివరగా జిల్లా కలెక్టర్‌కు ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు, సభ్యులు, ఆయా పత్రికల ప్రతినిధులు, సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు సాటి గంగాధర్, బి జగదీష్, గందోడి హరిప్రసాద్, ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి. ప్రకాష్, చిత్తూరు నియోజకవర్గ అధ్యక్షుడు కేశవులు, నేటిఆయుధం పత్రిక ఎడిటర్ రూపారెడ్డి, గిరిజన జయభేరి ఎడిటర్ ఈ రఘురాం, మనం పత్రిక ఎడిటర్ బృందం గాంధీ, చెంగల్రాయులు, మనధ్యాస పత్రిక ఎడిటర్ చంద్రశేఖర్ రెడ్డి, ఇప్పుడు పత్రిక స్టాఫ్ రిపోర్టర్ మునిచంద్రారెడ్డి, యువదర్శిని పత్రిక ఎడిటర్, తిరుపతి జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు మునికృష్ణయ్య, తిరుమల శక్తి ఎడిటర్ బొజ్జయ్య, నేటి మనదేశమ్ తెలుగు దినపత్రిక ప్రతినిధి కృపానందరెడ్డి, స్కైలైన్ ఆంగ్ల దినపత్రిక ప్రతినిధి శివశంకర్, దినకరన్ తమిళ దినపత్రిక ప్రతినిధి కుబేంద్రన్, కురుక్షేత్రం దినపత్రిక ప్రతినిధి దినేష్ కుమార్, చిత్తూరు పిసిఎన్ కేబుల్ టీవీ ప్రతినిధి యాదవేంద్రరెడ్డితో పాటు అధిక సంఖ్యలో ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు, సభ్యులు, జర్నలిస్టులు అధిక సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ప్రతి పేదవాడికి కార్పొరేట్ స్థాయి వైద్యమే సంజీవిని లక్ష్యం



**రామకుప్పం,ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి మరి వారి కుటుంబానికి కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించడమే సంజీవిని హెల్త్ క్యాంప్ లక్ష్యమని రామకుప్పం మండలం తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు అనదరెడ్డి ,జిల్లా కార్యదర్శి పట్రా నారాయణ, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు నర్సింహులు, మండల ప్రధాన కార్యదర్శి కామ్రాజ్ నాయక్ పేర్కొన్నారు.. సోమవారం రామకుప్పం మండల ప్రజా పరిషత్ సమావేశపు మందిరంలో మండల స్థాయి ప్రజాప్రతినిధులకు మరియు ముఖ్య నేతలకు సంజీవిని మిత్ర కార్యక్రమం నిర్వహణపై అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య నేతలు మాట్లాడుతూ 15337 టోల్ ఫ్రీ నెంబర్ కు ప్రజలు కాల్ చేసి తమ యొక్క ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన సూచనలు సలహాలు ఉచితంగా పొందవచ్చునని అలాగే తమకు సంబంధించిన వ్యాధిని పరీక్షించడానికి ప్రభుత్వ ఆసుపత్రి యందు సరైన డాక్టర్లు, పరీక్ష సామాగ్రి ఉందా లేదా అనే విషయాన్ని ముందుగా తెలుసుకోవచ్చని ప్రజలకు తమ వ్యక్తిగత ఫోన్ నెంబర్ల ద్వారా దూర ప్రాంతాల్లో ఉన్న ప్రముఖ వైద్యుల సేవలను కూడా ఉచితంగా పొందవచ్చునని ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని సంజీవిని మిత్ర కార్యక్రమం పట్ల అవగాహన కల్పించుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో సంజీవిని హెల్త్ కోఆర్డినేటర్ గోపీచంద్ ముఖ్య నేతలు యూనిట్ ఇంచార్జ్ సీతాపతి, సింగల్ విండో అధ్యక్షుడు మహమ్మద్ రఫీ, కడా మెంబర్ రఘు, రెవెన్యూ డివిజన్ ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ మెంబర్ కృష్ణ నాయక్ రవి రెడ్డి, జెఈ, గజేంద్ర, కోల్లపల్లి బాబు, తెలుగు యువత నేతలు అవినాష్ రెడ్డి, బాలకృష్ణ, ఏఎంసి డైరెక్టర్లు మునీంద్రనాయక్ , పవన్ కుమార్ మాజీ ఎంపిటిసి అల్లి శ్రీను, హరీష్ ఆదిల్ భాష, సుబ్రీ, భానుమూర్తి, చాంద్ బాషా, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

## సంపూర్ణ అక్షరాస్యతే అక్షరాంధ్ర లక్ష్యం: జిల్లా కలెక్టర్

**అనంతపురం,ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లాకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని 100 శాతం అక్షరాస్యులుగా మార్చడానికి సంబంధిత అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో వయోజన విద్య శాఖ ఆధ్వర్యంలో అక్షర ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్స్ లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంపూర్ణ అక్షరాస్యతే అక్షరాంధ్ర లక్ష్యం అని, ఈ ఏడాది జిల్లాలో 1,25,578 మందిని అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యం అన్నారు. ముఖ్యంగా జిల్లా / మండల / గ్రామ / వార్డు అధికారులందరూ అక్షర కేంద్రాలను సందర్శించి హాజరు శాతాన్ని పెంచి కార్యక్రమం సజావుగా నడిపించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఫిబ్రవరి 28 న జరిగే ప్రీ ఫైనల్ పరీక్ష, మార్చి నెలలో జరిగే FLNAT పరీక్షకు అందరు అభ్యాసకులు ఉత్తీర్ణులు కావాలని, భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డిఆర్ఓ ఏ.మలోల, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, ఆర్డీఓ కేశవనాయుడు, వయోజన విద్య ఉప సంచాలకులు సంపంగి వెంకటేశ్వర్లు, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

**అనంతపురం, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లాలో 64 పరీక్ష కేంద్రాలలో సోమవారం ఇంటర్ పరీక్షలు ప్రారంభమైనవి. పరీక్షలకు జనరల్ విద్యార్థులు 22,848 గాను 22,213 మంది హాజరు కావడం జరగగా, 632 మంది గైర్హాజర్ కావడం జరిగింది. ఒకేషనల్ విద్యార్థులు 2,306 గాను 2,166 మంది హాజరు కావడం జరగగా, 140 మంది గైర్హాజర్ కావడం జరిగింది. జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ నగరంలోని కోర్ట్ రోడ్డులో వున్న శ్రీ సత్యసాయి ఆర్ట్స్ అండ్ సైన్స్ ఫర్ వుమెన్స్ కాలేజీ నందు పరీక్షల నిర్వహణను ఆకస్మికంగా తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేయడం జరిగింది. కన్వీనర్ ం ప్రాంతీయ పర్యవేక్షణాధికారి 3 పరీక్షా కేంద్రాలను, జిల్లా వృత్తి విద్యా శాఖాధికారి యస్.వి.యస్.గురవయ్య చెట్టి 6 పరీక్ష కేంద్రాలను, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు 4 పరీక్షా కేంద్రాలను, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు 8 పరీక్షా కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ సభ్యులు 12 పరీక్షా కేంద్రాలను తనిఖీ చెయ్యడం జరిగిందని, పరీక్షలను సిసి కెమెరాల పర్యవేక్షణలో పకడ్బందీగా నిర్వహించడం జరిగిందని కన్వీనర్, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటి, ప్రాంతీయ పర్యవేక్షణాధికారి యం.వెంకటరమణ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.

## సజావుగా ఇంటర్ పరీక్షలు: జిల్లా కలెక్టర్

**అనంతపురం,ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా ప్రారంభమయ్యాయని, ఇందుకోసం అన్ని కేంద్రాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టామని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం అనంతపురం నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న శ్రీ సత్యసాయి ఆర్ట్స్ అండ్ సైన్స్ ఫర్ గర్ల్స్ కాలేజ్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించడం జరుగుతోందన్నారు. పరీక్ష కేంద్రంలో ఎటువంటి మాల్ ప్రాక్టీస్ లేకుండా పర్యవేక్షణ చేయాలని చీఫ్ సూపరింటెండెంట్ కు సూచించారు. అన్ని కేంద్రాల్లో మెడికల్ క్యాంపు, తాగునీరు, తదితర ఏర్పాట్లు చేశామని, సిసి కెమెరాల ద్వారా పరీక్షలను పర్యవేక్షణ చేస్తున్నామని ఆర్ఐఓ వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐఓ వెంకటరమణ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## 'స్వర్ణ ఆంధ్ర 2047' క్యాలెండర్‌ను ఆవిష్కరించిన జేసీ

**అనంతపురం, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లా కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్ నందు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వర్ణ ఆంధ్ర 2047' విజన్ ప్రణాళికలో భాగంగా రూపొందించిన నూతన క్యాలెండర్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, ఆ దిశగా జిల్లా యంత్రాంగం మరియు ప్రజలు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిఆర్ఓ సూర్యనారాయణ రెడ్డి, ఎస్‌డిసి రామసుబ్బయ్య, పిడి డిఆర్ డిఎ నరసయ్య జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్తలచే నిరసన

**బైరెడ్డిపల్లి, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల కేంద్రంలోని సచివాలచ ఆవరణం నందు సోమవారం అంగన్వాడీలు వివిధ సంఘాల ఆధ్వర్యంలో తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు ప్రసంగిస్తూ మూడు సంవత్సరాలు దాటిన ఉద్యోగులను పర్మినెంట్ చేయాల్సి ఉండగా, కనీస వేతనం కూడా ఇవ్వకుండా అంగన్వాడీలచే వెట్టి చాకిరి చేయించుకుం టున్నారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను దుయ్యబట్టారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం చేసిన వాగ్దానాలను వెంటనే అమలుపరచాలన్నారు. లేనట్లయితే నిరసనలను ఉధృతం చేస్తామన్నారు.

# చిత్తూరు జిల్లా

## ఘనంగా లిటిల్ రోజ్ పాఠశాల 40వ వార్షికోత్సవం

### - అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు






**చిత్తూరు , ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగరంలోని లిటిల్ రోజ్ గ్లోబల్ స్కూల్ 40వ వార్షికోత్సవాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో జరిగిన వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్స్ బనవత్ లక్ష్మణ్, అడిషనల్ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ జి వెంకటప్రసాద్, వేము ఇంజనీరింగ్ కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్ చంద్రశేఖర్ నాయుడు హాజరయ్యారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ బి గోపాలకృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హాజరైన అతిథులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు తమకంటూ ఒక గోల్‌ను ఎంచుకొని సాధించాలన్నారు. దాదాపు 40 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ఈ పాఠశాల నుంచి అనేక మంది విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదిగారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ లోహిత్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధిక గోపాలకృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. అంతకు ముందు ఉదయం నాగయ్య కళాక్షేత్రంలోనే హలో కిడ్స్ పాఠశాల 5 వ వార్షికోత్సవాన్ని సైతం డాక్టర్ గోపాలకృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి భారతి, జిల్లా అగ్నిమాపకాధికారి పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలకు 195 మంది హాజరు



**రామసముద్రం,ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకుని హాల్ టికెట్లు పరిశీలించుకుని కేటాయించిన గదుల్లోకి ప్రవేశించారు. ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చెందిన మొత్తం 201 మంది విద్యార్థులు తెలుగు, హిందీ, పరీక్ష రాయాల్సి ఉండగా 195 మంది హాజరై, ఆరుగురు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ చిట్టిబాబు తెలిపారు. పరీక్షల సజావు నిర్వహణ కోసం కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేసి పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇదే కేంద్రంలో అంగవైకల్యం కలిగిన విద్యార్థి గంగాధర్ తల్లి సహాయంతో పరీక్షకు హాజరై, అధికారులు కల్పించిన సదుపాయాల మధ్య ధైర్యంగా పరీక్ష రాయడం ప్రత్యేకంగా నిలిచింది.

## చెక్‌పోస్ట్‌లో కర్ణాటక మద్యం పట్టివేత ఇద్దరు అరెస్టు



**రామసముద్రం, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అక్రమ మద్యం రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. మండలం దిగువ హరిజనవాడకు చెందిన సీతన్నగారి అనిల్ కుమార్(25), ఉగిని నాగరాజు(47)లు కర్ణాటక రాష్ట్రం బ్యాడపల్లి నుంచి రామసముద్రం వైపు మద్యం తరలిస్తుండగా చొక్కాండ్లపల్లి చెక్‌పోస్ట్ వద్ద పట్టుబడ్డారు. ఎస్సై ఉమామహేశ్వర్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన తనిఖీల్లో 100 సాచెట్ల బ్రాందీ, 192 టెట్రా ప్యాకెట్లు విస్కీ అక్రమంగా తరలిస్తున్నట్లు బయటపడింది. మద్యం సరుకుతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఉమామహేశ్వర్ రెడ్డి తెలిపారు. అక్రమ మద్యం రవాణాపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.

## రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



**కందుకూరు,ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రైతుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏపీ రాష్ట్ర సంఘం కందుకూరు నియోజకవర్గం కార్యదర్శి ఎం లక్ష్మీనారాయణ, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర రైతు సంఘం పిలుపుమేరకు స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులకు ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ, సురేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్లో వ్యవసాయానికి 10 శాతం నిధులు కేటాయించి రైతులను ఆదుకోవాలని అన్నారు. అన్నదాత సుఖీభవ నిధులను వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. పకృతి విపత్తుల సమయంలో నష్టపోయిన రైతులను ఆదుకోవటానికి నాలుగువేల కోట్ల రూపాయలు నిధులు కేటాయించాలని, వడ్డీ రాయితీకి రూ.2 వేల కోట్లు కేటాయించాలని, మైనర్ ఇరిగేషన్‌కు రూ.5 వేల కోట్లు కేటాయించాలని పేర్కొన్నారు. కౌలు రైతులకు ఆర్బీఐ నిబంధనల ప్రకారం రూ.2 లక్షలు వరకు గ్యారెంటీ లేని పంట రుణాలు ఇవ్వాలని, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఉప్పుటూరు మాధవరావు, దుర్గాప్రసాద్, బాల బ్రహ్మచారి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజన్స్‌కు రైల్వే రాయితీని పునరుద్ధరించాలి

## - భువనేశ్వర్ జాతీయ మహా సభలో ఎపి గొంతుక




**మదనపల్లె, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**అల్ ఇండియా సీనియర్ సిటిజన్స్ కాన్ఫెడరేషన్ నేషనల్ కాన్ఫెరెన్స్ సమావేశాలు ఒరిస్సా రాష్ట్రం లోని భువనేశ్వర్ లో రైల్వే అడి టోరియం నందు ఫిబ్రవరి 22, 23 తేదీలలో ఘనంగా జాతీయ సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు మతురాజ్ కృష్ణ రెయినా, జాతీయ సెక్రటరీ జనరల్ శ్రీహరి షిథాయి ఆధ్వర్యంలో నిర్వహించ బడ్డాయి. ఈ జాతీయ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ నుండి ఎపి సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్.ముని గోపాల కృష్ణ, ఎపి రాష్ట్ర అధ్యక్షులు నారాయణ మూర్తి, సెక్రటరీ జనరల్ రామ చంద్రరావ్, జాతీయ జాయింట్ సెక్రటరీ వీరా రావ్, మోతు కురి వెంకటేశ్వర రావ్, నాగేంద్ర రెడ్డి, వెంకట రమణలు హజరయ్యారు. ఈ సమావేశంలో ముఖ్యంగా 8 సీనియర్ సిటిజన్స్ సమస్యలను టీపీఆర్ ఉన్ని వివరించారు. అందరి మొదటి సమస్య సీనియర్ సిటీజన్స్‌కు రైల్వే రాయితిని కొవిడ్ సమయంలో తాత్కాలికంగా కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. రైల్వే రాయితీ మావాక్కు, దానిని తిరిగి పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వానికి జాతీయ డిమాండ్‌గా తెలియ చేశారు. అన్ని సమస్యలను పరిష్కరించాలని జాతీయ స్థాయితో సీనియర్ సిటిజన్స్ ఏక గ్రీవంగా ఆమోదించి నిరసన తెలియ జేశారు. సెంట్రల్ కాన్సిల్ సమావేశంలో డాక్టర్ ముని గోపాల కృష్ణ ఆంధ్రప్రదేశ్ తరపున రైల్వే రాయితీని పునరుద్ధరించాలని, ఎపి గొంతుకను జాతీయ స్థాయిలో వినిపించారు. దీనిపై జాతీయ అధ్యక్షులు రెయినా స్పందిస్తూ ఈ రైల్వే రాయితీ ప్రధమ జాతీయ సీనియర్ సిటిజన్స్ సమస్యగా ప్రకటించారు. అలాగే మోతు కూరి వేంక టేశ్వరరావుకు జాతీయ స్థాయిలో ఉత్తమ సినియర్ సిటిజన్ అవార్డును ప్రదానం చేశారు.

# పదవ తరగతి పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలి: డీఆర్వో



**మదనపల్లె, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**మార్చిలో జరగబోయే పదవ తరగతి పరీక్షలను అత్యంత పగడ్బందీగా నిర్వహించాలని, కాపీయింగ్ జరిగితే చర్యలు తప్పవని, జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు అధికారులను ఆదేశించారు. సోమవారం మదనపల్లె కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు విద్య, వైద్య, విద్యుత్, పోలీస్, ట్రెజరీ తదితర శాఖల అధికారులతో మార్చి 16 నుంచి 1 ఏప్రిల్ వరకు జరగబోయే పదవ తరగతి పరీక్షలపై సమన్వయ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ.. పదవ తరగతి పరీక్షలు విద్యార్థి జీవితంలో చాలా కీలక పాత్ర పోషిస్తాయని, వీటిని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ముందుగా జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం, పదవ తరగతి పరీక్షలపై వివిధ అంశాలను జిల్లా రెవెన్యూ అధికారికి వివరించారు. జిల్లాలో 124 కేంద్రాలలో 22,149 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారన్నారు. వీరిలో 623 మంది ఇంతకు మునుపు ఫెయిల్ అయ్యి ఇప్పుడు రాయబోతున్నారన్నారు. 11012 మంది బాలురు 11137 మంది బాలికలు పరీక్షకు హాజరు అవ్వబోతున్నారన్నారు. ఇదే తేదీలలో మధ్యాహ్నం రెండున్నర నుంచి ఐదున్నర వరకు ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ కింద పదవ తరగతి, ఇంటర్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఓపెన్ స్కూల్ పరీక్షలకు 2370 మంది విద్యార్థులు హాజరవబోతున్నారన్నారు. వీరిలో 648 మంది పదవ తరగతికి 1722 మంది ఇంటర్ పరీక్షలకు హాజరవుతున్నారు అన్నారు. సమీక్ష సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# దోబి ఘాట్ మంజూరు చేసి రజకులను ఆదుకోవాలి

## - అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు వినతి



**మదనపల్లె,ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మదనపల్లె మండలం బికే పల్లి గ్రామం, నీరు గట్టు వారిపల్లి నివసించు రజకులు గత 25 సంవత్సరాల నుండి రజక వృత్తి చేసుకుంటూ జీవనం కొనసాగిస్తు న్నామని జిల్లా కలెక్టర్ కు విన్నవించారు. సోమవారం అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లె కలెక్టరేట్లో పిజిఆర్ఎస్ కార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ముసలి కుంట నాగయ్య, రజక సంఘాల నాయకులు ముదిమడుగు రామ్మూర్తి, కలిచర్ల రామ్మూర్తిల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రజక వృత్తి కొనసాగించడానికి సరైన సదుపాయాలు లేక చాలా ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా దోబీ ఘాట్ కావాలని పిజిఆర్ఎస్ ద్వారా పలుమార్లు ఆర్జీ పెట్టుకున్నామని గుర్తు చేశారు. దీనిపై తహసిల్దార్ తమ అభ్యర్థన పై సర్వే నెంబరు 440లో 2 ఎకరాల 55 సెంట్లు, మరో సర్వేనెంబర్ 579 ఒకటో లెటర్ 50 సెంట్లు, 579 రెండో లెటర్ 50 సెంట్లు స్థలము సేకరించి, సబ్ కలెక్టర్ గారికి ప్రతిపాదనలు పంపియున్నారని తెలిపారు. సబ్ కలెక్టర్ ఈ స్థలన్ని పరిశీలించి ఆమోదం తెలిపి అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కి ప్రతిపాదనలు పంపారు. కలెక్టర్ పరిశీలించి దోచి ఘాట్ మంజూరు చేసి రజకుల్ని ఆదుకోవాలని కోరారు. అలాగే బిసి కార్పొరేషన్ ఈడి జయ సింహకు వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో రజకులపై దాడులు రోజు రోజుకు పెరుగు తున్నాయని ఈ నేపథ్యంలో ప్రభుత్వం రజకులకు బిసి రక్షణ చట్టం తీసుకు వచ్చి, భద్రత కల్పింగడంతో పాటు, బాధితులకు న్యాయం చేయాలని కొరుతూ మదనల్లె రజక సంఘాల నాయకులు ముది మడుగు రామ్మూర్తి, కలిచర్ల రామ్మూర్తిలు విజ్ఞప్తి చేశారు. కేవలం కుల వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న రజకులకు రాజకీయ అండదండలు కొరవడటంతో అబద్రత నడుమ, భయం గుపల్లో జీవనం సాహిస్తున్న పరిస్థితులు దర్పణం పడుతున్నాయి.ఇందుకు మహిళపై కత్తితో దాడి చేసిన సంఘటన తో పాటు, నాగర్ కర్నూల్ జిల్లా, కుమ్మెర గ్రామం రజకులపై రెడ్ల క్రూర దాడిలో నిందితులను వెంటనే అరెస్టు చేసి చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నా మన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.చంద్ర, డి.చంద్ర శేఖర్, మోహన్, ఏం. చంద్రశేఖర్, శ్రీనివాసులు, మునిరత్నంలు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థినులకు పరీక్ష సామాగ్రి వితరణ



**మదనపల్లె,ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థినిలకు పరీక్ష సామాగ్రిని అన్నమయ్య జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేశారు. సోమవారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నందు అన్నమయ్య జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మౌలాలి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సివిల్ సప్లైస్ డిటి ఫిరోజ్ ఖాన్ హాజరయ్యారు. ఇందులో భాగంగా 131 మంది పదవ తరగతి విద్యార్థినులకు రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నాయకులు రఘు, చంద్ర, వేణు, చలపతి, డిటి పిరోజ్ ఖాన్, పాఠశాల ఉపాధ్యాయులు శంకర్, శివప్రసాద్, మంజుల, తదితరులు ప్రతి విద్యార్థినికి పరీక్ష రాసే ప్యాడ్, రెండు పెన్నులు, పెన్సిళ్లు, రబ్బరు, మెండర్, స్కేల్ తదితర వస్తువులను అందజేయడం జరిగింది. అనంతరం డిటి ఫిరోజ్ ఖాన్ మాట్లాడుతూ పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాయబోతున్న విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు



**మదనపల్లె,ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సోమవారం ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 15,203 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా అందులో 14,442 మంది విద్యార్థులు హాజరు కాగా 761 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.వీరిలో జనరల్ విభాగానికి 14,012 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా,13,420 మంది విద్యార్థులు హాజరై పరీక్షలు రాశారు.592 మంది గైర్హాజరయ్యారు.అదేవిధంగా ఒకేషనల్ విభాగంలో గ్రూపులో 1,191 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 1,022 మంది హాజరు కాగా 169 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈఓ రవి తెలిపారు. జిల్లావ్యాప్తంగా 700 పరీక్ష కేంద్రాలలో ఇంటర్ పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకే పరీక్ష ప్రారంభం కాగా విద్యార్థులు 8 గంటలకే ఆయా పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. 8:30 గంటలకు విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీలు చేసిన అనంతరం అనుమతించారు. విద్యార్థులకు సెంటర్ల వద్ద ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలను కల్పించారు.దీంతో విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాశారు.

# మిట్స్ వర్సిటీచే గట్టులో దంత వైద్య శిబిరం




**మదనపల్లె/ కురబలకోట,ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ యెన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గట్టు గ్రామ పంచాయతీ నందు ఫిబ్రవరి 22 నుంచి 28 వరకు యెన్ఎస్ఎస్ ప్రత్యేక క్యాంప్‌లో భాగంగా దంత, కంటి ప్రత్యేక వైద్య శిబిరం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమం మొదటి రోజు మదనపల్లె స్కంద డెంటల్ మల్టీ స్పెషలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో దంత వైద్య శిభిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో స్కంద డెంటల్ మల్టీ స్పెషలిటీ హాస్పిటల్ డాక్టర్ రెడ్డి అఖిల్ మాట్లాడుతూ గ్రామాల్లో ఇలాంటి దంత వైద్య శిబిరాలు నిర్వహించడం చాలా అవసరమని, చిన్న సమస్యలను కూడా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. రోజుకు రెండుసార్లు పళ్లు తోమడం, ప్రతి ఆరు నెలలకు ఒకసారి దంత పరీక్ష చేయించుకోవడం మంచి అలవాటు అని సూచించారు. పళ్ల సమస్యలు మొదటి దశలో నొప్పి లేకుండా ఉండవచ్చు కానీ సమయానికి పరీక్ష చేయించుకోకపోతే దంత క్షయం, మజిల్స్ వాపు, రక్తస్రావం, ఇన్‌ఫెక్షన్లు వంటి సమస్యలు తీవ్రమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. క్రమం తప్పకుండా దంత పరీక్ష చేయించు కోవడం ద్వారా సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి సులభంగా చికిత్స చేయవచ్చు అని చెప్పారు. ఇలాంటి దంత వైద్య శిబిరాలు ఆరోగ్యవంత మైన సమాజ నిర్మాణానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో యెన్.ఎస్.ఎస్ ఆఫీసర్ పి.రాజేష్, 50 మంది యెన్.ఎస్.ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్

**ములకలచెరువు, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల కేంద్రంలో బిజెపి ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంకు ముఖ్య అతిథులుగా నాగోతు రమేష్ నాయుడు బిజెపి రాష్ట్ర జనరల్ సెక్రెటరీ, బిజెపి సీనియర్ నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి, బండి ఆనంద్ ఓబిసి జనరల్ సెక్రెటరీ, ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి మడుమూరు రాందాస్, బిజెపి సీనియర్ లీడర్ గోపాల్ రెడ్డిలు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్ ఆవరణలో బిజెపి నాయకులు, కార్యకర్తలు కలిసి చెత్తను శుభ్రం చేశారు. అనంతరం బీజేపీ పార్టీ కార్యాలయంలో సంతు గాడ్గే బాబా 150వ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో 50 మంది రజకులకు పార్టీ కండువా కప్పి పార్టీలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి మడుమూరు రామదాసు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఓబిసి జిల్లా అధ్యక్షులు రేపన శివప్రసాద్, మొలకలచెరువు మాజీ మండల అధ్యక్షులు జయరాం రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు మోహన్, నాయకులు రామానుజులు తదితరులు పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

## - జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**మదనపల్లె,ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ఏడి సర్వే భరత్ కుమార్, జిఎస్ డబ్ల్యూఎస్ లక్ష్మీపతి ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుండి 348 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పిజిఆర్ఎస్ అర్జీలకు సంబంధించి ఉన్నతాధికారులతో సమీక్ష చేస్తున్నారన్నారు. జిల్లా అధికారులు అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, ఆయా శాఖల పరిధిలో పిజిఆర్ఎస్ గ్రీవెన్స్‌పై ఆడిట్ నిర్వహించాలన్నారు.

**ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు**

చౌడేపల్లి మండలం దిగువ పల్లి పంచాయతీ పరిధిలోని అప్పినేపల్లి గ్రామం కు చెందిన ఎం చిన్న రెడ్డప్ప నాయుడు తన భూమికి సంబంధించి సాంకేతిక లోపం వల్ల సమస్య వచ్చిందని మెట్ట కు బదులు పట్టాగా మార్చి వన్ బి, అడంగల్ మంజూరు చేయవలసిందిగా జిల్లా కలెక్టర్ కు విన్నవించు కున్నారు. కురబల కోట మండలం నందిరెడ్డి గారి పల్లి పంచాయతీకి చెందిన యస్.ముంతాజ్ ఇంటికి దారి లేక అవస్థలు పడుతున్నామని న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ కు విన్నవించు కున్నారు. పెద్ద తిప్ప సముద్రం మండలం కందుకూరు గ్రామపంచాయతీ పరిధిలో సర్వేనెంబర్ 1469లో గల సాగుభూమి లో బోరు వేసి 18 హెచ్ పి విద్యుత్ కనెక్షన్ ట్రాన్స్ఫర్ కొరకు ఏపీ ఎస్పీడీసీఎల్ మదనపల్లి వారి పేరిట డబ్బులు చెల్లించడం జరిగిందని, అధికారులు ట్రాన్స్ఫార్మర్ మంజూరు చేయలేదని ఈ విషయమై మంజూరు చేసి ఆదుకోవాలని జిల్లా కలెక్టర్‌ని కోరారు. ఈ సమస్యలన్నీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అన్నమయ్య జిల్లా

# మిట్స్ వర్సిటీలో విదేశీ ఉన్నత విద్య, ప్రైవేట్ స్కాలర్‌షిప్‌పై అవగాహన

## - ముఖ్యఅతిథిగా ఎమ్.ఎస్ అబ్రాడ్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మురళీకృష్ణ పురాణం



**మదనపల్లె/ కురబలకోట, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ నందు స్టూడెంట్ వెల్ఫేర్ సెల్ ఆధ్వర్యంలో "విదేశాలలో ఉన్నత విద్య కార్యక్రమాల కోసం యూనివర్సిటీ వారి ప్రైవేట్ స్కాలర్‌షిప్స్ అంశంపై అవగాహన కార్యక్రమంను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతికి చెందిన ఎమ్.ఎస్ అబ్రాడ్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మురళీకృష్ణ పురాణం పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలని ఆశించే విద్యార్థులకు ప్రత్యక్షంగా విదేశీ విశ్వవిద్యాలయాలు అందించే స్కాలర్‌షిప్ లు అందిస్తున్నాయని అన్నారు.విద్యార్థుల విద్యార్హతలు, ఆసక్తి, కెరీర్ లక్ష్యాలను బట్టి సరైన యూనివర్సిటీ మరియు కోర్సు ఎంపికలో సహకరిస్తామని, అలాగే వీసా డాక్యుమెంటేషన్, ఇంటర్వ్యూ సన్నాహాలు తన కన్సల్టెన్సీ ద్వారా అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉన్నత విద్యలో అధునాతన తయారీ సాంకేతికతలు, రోబోటిక్స్, ఆటోమొబైల్, ఏరోస్పేస్ వంటి ప్రత్యేక విభాగాల్లో నైపుణ్యం పొందడానికి విదేశీ విశ్వవిద్యాలయాలు స్కాలర్‌షిప్‌లు, స్టైపెండ్లు ద్వారా అవకాశాలను కల్పిస్తున్నాయని తెలిపారు.. ఆధునిక ప్రయోగశాలలు, పరిశోధన సదుపాయాలు, పరిశ్రమలతో అనుసంధానం ద్వారా విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి జ్ఞానం లభిస్తుందని అన్నారు. విదేశాల్లో ఇంజనీరింగ్‌లో ఉన్నత విద్య అభ్యసించడం వల్ల ప్రపంచ స్థాయి కెరీర్ అవకాశాలు, పరిశోధన, ఇన్నోవేషన్‌లో పాల్గొనే అవకాశం, మెరుగైన ఉద్యోగ అవకాశాలు పొందడానికి విద్యార్థులు సరైన ప్రణాళికతో ముందుకు సాగడం అవసరం అని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్, సీనియర్ మేనేజర్-స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ పి.అథాహర్ సమీనా ఖాన్, రాగ దీప్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాధితులకు అండగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక: జిల్లా ఎస్పీ



**మదనపల్లె,ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బాధితులకు అండగా పిజిఆర్ఎస్ నిలుస్తుందని, ప్రజల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేయడమే పోలీసు శాఖ ప్రథమ కర్తవ్యమని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి పేర్కొన్నారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధితుల నుండి ఫిర్యాదులు తీసుకున్న ఎస్పీ ప్రతి బాధితుడితో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఆయా ఫిర్యాదులను సంబంధిత అధికారులకు బదిలీ చేసి,నిర్దేశిత సమయంలోగా వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వికలాంగులు, వృద్ధులు, మహిళలు ఇచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి, మొదటి ప్రాధాన్యతగా, బాధ్యతగా, జవాబుదారీతనంతో వ్యవహరించి న్యాయం చేయాన్నారు. సమస్యల పరిష్కారానికి ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని, పోలీసు శాఖ ప్రజల భద్రత, న్యాయం కోసం కట్టుబడి ఉంటుందని ఎస్పీ తెలిపారు.

# సుగవాసి ప్రసాద్ బాబును కలిసిన టీడీపీ నాయకులు



**రాయచోటి, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**సోమవారం రాయచోటి పట్టణం గాలివీడు రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబుని మదనపల్లి తెలుగుదేశం పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై ఈ సమావేశంలో చర్చించారు. పఠాన్ ఖాదర్ ఖాన్ (పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి), షంషీర్ (మదనపల్లి టీడీపీ నాయకులు), సహాదేవ నాయుడు (మదనపల్లి టీడీపీ నాయకులు), బద్రి (మదనపల్లి టీడీపీ నాయకులు), పూస చంద్రమోహన్ రెడ్డి (పార్లమెంట్ ఉపాధ్యక్షులు), ఆయూబ్ (ప్రధాన కార్యదర్శి), ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంఘమిత్ర ఉద్యోగం ఇవ్వండి!

## - జిల్లా కలెక్టర్, డిఆర్ డిఏ పిడీలకు ఫిర్యాదు



**ములకలచెరువు, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**వెలుగు(డిఆర్‌డిఏ)లో ఓ సంఘమిత్ర ఉద్యోగం సంఘమిత్రగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఓ మహిళ కుమార్తెకు ఉద్యోగం కట్టబెట్టేం దుకు రాజకీయ నాయకులు, వెలుగు సిబ్బంది, వివోలో లీడర్లు సన్నాహాలు చేస్తున్నారు. తాను ఓ దళిత కుటుంబానికి చెందిన దానిని కాబట్టి నాకు సంఘమిత్ర ఉద్యోగం ఇవ్వకుండా రాజకీయం చేస్తున్నారంటూ తనకు న్యాయం చేయాలని ఓ దళితురాలు అన్నమయ్య జిల్లా కలెక్టర్, డిఆర్డిఏ పీడీలకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకెళ్తే.. మండలం లోని చౌడ సముద్రం గ్రామం వివో 1 సంఘమిత్రగా శ్యామలమ్మ ఉద్యోగ విరమణ పొంది తన కుమార్తె భరణిని కొద్ది నెలల క్రితం సభ్యురాలుగా చేర్చుకొని సహకరించాలని ఒప్పందం కుదుర్చుకుని ఏపీఎంపై ఒత్తిడి తెచ్చారు. చౌడ సముద్రం గ్రామం, ఎస్సీ కాలనీకి చెందిన గంగాదేవి డిగ్రీ వరకు చదువుకొని శ్రీ వెంకటేశ్వర స్వయం సహాయక సంఘంలో మొదటి లీడర్‌గా పని చేస్తోంది. సంఘమిత్ర పోస్టు ఖాళీ అవడంతో తనకు సంఘమిత్రగా నియమించాలని ఏపిఎంను, వివో లీడర్లను కోరింది. వారు ఇవ్వకపోవడంతో తనకు న్యాయం చేయాలని సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో జిల్లా కలెక్టర్, డిఆర్డిఏ పీడీలకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్, పీడీలు స్పందించి విచారించి న్యాయం చేస్తామని బాధితురాలికు తెలిపారు.

# చట్టానికి ఎవరు అతిథులు కాదు

## - జనసేన ఇన్చార్జి సాయినాథ్



**ములకలచెరువు,ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చట్టానికి ఎవరూ అతిథులు కారని, తప్పు చేస్తే శిక్ష అనుభవించక తప్పదని తంబళ్లపల్లి నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జి పోతుల సాయినాథ్ తెలిపారు. మండల కేంద్రంలోని జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ములకలచెరువులో ఇటీవల ఓ మైనర్ బాలిక తప్పిపోవడం, పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కేసు విషయంపై జనసేన పార్టీపై, నామీద బురద చల్లడం సరికాదన్నారు. నా సోదరుడు కిడ్నాప్ చేశారంటూ ఆరోపణలు వస్తున్నాయని, అది ఎంతవరకు వాస్తవమో తనకు తెలియదన్నారు. నిజంగా తన సోదరుడే కిడ్నాప్ చేసి తప్పు చేసి ఉంటే చట్టం ఊరుకోదని తెలిపారు. వాస్తవాలు తెలియకుండా తనపై పార్టీపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. నేను బాలిక కుటుంబ సభ్యులను బెదిరించినా అని సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు వార్తలలో వాస్తవం లేదని నేను ఎప్పటికీ బాలిక కుటుంబానికి అండగా ఉండాలని తెలిపారు. ఇందులో ఎలాంటి రాజకీయ కోణం ఉండదని స్పష్టం చేశారు.

# ఇండియా కూటమి నేతగా రాహుల్ తప్పుకోవాలి

### నాయకత్వాన్నా ప్రాంతీయ పార్టీలకు అప్పగించాలి

### కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ సంచలన వ్యాఖ్యలు


**కోల్‌కతా,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ):** కాంగ్రెస్ వెటరన్ నేత మణిశంకర్ అయ్యర్ మరోసారి సొంత పార్టీపై విమర్శల దాడి చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వాన్ని ప్రశ్నించారు. 'ఇండియా' కూటమి సారథ్య బాధ్యతల నుంచి రాహుల్‌గాంధీ తప్పుకోవాలని, ఆ బాధ్యతలను ప్రాంతీయ పార్టీల నేతలకు అప్పగించాలని కోల్‌కతాలో మీడియాతో మాట్లాడుతూ ఆయన సూచించారు. మమత బెనర్జీ, అఖిలేష్ యాదవ్, ఎంకే స్టాలిన్, తేజస్వీ యాదవ్ వంటి సమర్థులైన నేతలు రాహుల్ గాంధీ నుంచి పగ్గాలు చేపట్టాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇటీవల పలు ఎన్నికల్లో వైఫల్యాలను చవిచూడడాన్ని అయ్యర్ ప్రస్తావిస్తూ, మమత బెనర్జీని దూరం చేసుకోవడం వల్లే కాంగ్రెస్ బలహీనపడిందని అభిప్రాయపడ్డారు. మమత బెనర్జీ లేకుంటే 'ఇండియా' కూటమి ఉనికికే ప్రమాదమని అన్నారు. కూటమి బాధ్యతలను తన చేతిలో పెట్టుకోకుండా ప్రాంతీయ పార్టీల నేతలైన స్టాలిన్, మమత దీదీ, అఖిలేష్, తేజస్వి ఇంకెవరికైనా రాహుల్ గాంధీ అప్పగిస్తారని ఆశిస్తున్నానని, వారయితే ఎక్కువ సమయం కేటాయించగలరని అయ్యర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీపై మణిశంకర్ అయ్యర్ నిశిత విమర్శలు చేయడం ఇదే మొదటిసారి కాదు. ఇటీవల కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పాల్గొన్న ఒక కార్యక్రమానికి అయ్యర్ హాజరయ్యారు. పినరయి విజయన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారంటూ ఆయనపై ప్రశంసలు కురిపించారు. త్వరలో కేరళ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో పినరయి విజయన్ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీని ఇరకాటంలో నెట్టింది. మణిశంకర్ అభిప్రాయం పార్టీ అభిప్రాయం కాదని, ఆయన వ్యాఖ్యలు, వ్యాసాలు పూర్తిగా ఆయన వ్యక్తిగతమని పేర్కొంది. కాగా, 'ఇండియా' కూటమి నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకోవాలంటూ అయ్యర్ చేసిన తాజా వ్యాఖ్యలపై కాంగ్రెస్ వెంటనే స్పందించింది. రాహుల్ గాంధీ మాత్రమే ఇండియా కూటమిని సమర్థవంతంగా ముందుకు నడిపించగలరని, బీజేపీని ఎదుర్కొనగలిగే సత్తా రాహుల్‌కే ఉందని ఆ పార్టీ నేత ఇమ్రాన్ మసూద్ వ్యాఖ్యానించారు. బెంగాల్ కాంగ్రెస్ నేతలు సైతం అయ్యర్ వ్యాఖ్యలను ఖండించారు. కాంగ్రెస్ పార్టీకి చాలాకాలంగా మణిశంకర్ అయ్యర్ దూరంగా ఉన్నారని, బెంగాల్ నుంచి ఐదు రాజ్యసభ సీట్లు ఖాళీగా ఉండటమే మణిశంకర్ అయ్యర్ తాజా వ్యాఖ్యలకు కారణం కావచ్చని బెంగాల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సుమన్ రాయ్ అన్నారు.

# సుబ్రహ్మణ్యస్వామికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

### -ఏకసభ్య కమిషన్ విచారణపై పిటిషన్ కొట్టివేత

### -కల్తీ నెయ్యి వ్యవహారంలో దర్యాప్తునకు మార్గమం సుగమం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ):** మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై ఏపీ ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించడాన్ని సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ ఓవర్ లాపింగ్ కిందకు రాదని.. పరిపాలనాపరమైన లోపాల గుర్తింపునకు ఏర్పాటు చేసిందని సీజేఐ ధర్మాసనం పేర్కొంది. కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై దర్యాప్తు కోసం సుప్రీంకోర్టు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేసినా దానికి అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విచారణ కమిషన్,కమిటీని ఏర్పాటుచేయాలని ఈ నెల 3వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించడాన్ని సవాలుచేస్తూ మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలుచేశారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై దర్యాప్తు కోసం సుప్రీంకోర్టు ప్రత్యేక సిట్ ఏర్పాటుచేసినా దానికి అతీతంగా



కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిషన్/కమిటీని ఏర్పాటుచేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. సోమవారం సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్‌ను కొట్టివేసింది. తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగం వ్యవహారంలో ఏక సభ్య కమిటీ ఏర్పాటుపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిటీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ అంశంపై సోమవారం విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది. శ్రీవారి లడ్డూ వ్యవహారంపై సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఇచ్చిన నివేదికపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేశ్ కుమార్ ఆధ్వర్యంలో ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ కేసులో ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రాతో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. సిట్ నివేదికను పరిశీలించి.. పరిపాలనా లోపాలు, టెండర్ అవకతవకలు, బాధ్యులను గుర్తించడానికే ఈ కమిటీని నియమించినట్లు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లింది ప్రభుత్వం. అలాగే సీబీఐ సిట్ విచారణకు ఎలాంటి ఆటంకం ఉండదని స్పష్టం చేసింది. దీంతో కమిషన్ ఏర్పాటును సుప్రీం సమర్థించింది.

# మాజీ రైల్వేమంత్రి ముకుల్ రాయ్ మృతి



**కోల్‌కతా,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ):** మాజీ రైల్వే మంత్రి, తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు ముకుల్ రాయ్ మృతి చెందారు. ఆదివారం తెల్లవారుజామున 1:30 గంటలకు కోల్‌కతాలోని సాల్ట్ లేక్ అపోలో ఆసుపత్రిలో గుండెపోటుతో మరణించారు. రాయ్ మతిమరుపు వ్యాధితో బాధపడుతున్నారు. అనేక అనారోగ్యాలతో బాధపడుతున్న రాయ్ కొన్ని రోజుల క్రితం కోమాలో ఉన్నారు. మృతదేహాన్ని ఆయన నివాసానికి తీసుకెళ్లి, అంత్యక్రియలు నిర్వహించారు. గత రెండు సంవత్సరాలుగా ముకుల్ రాయ్ ఆసుపత్రిలో, ఆయన నివాసంలో చికిత్స పొందుతున్నారు. తెలిసిన ముఖాలను కూడా ఆయన గుర్తించే సామర్థ్యాన్ని కోల్పోయారు. ఆయన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి సన్నిహితుడు. ఆయన 2017లో బిజెపిలో చేరారు. ముకుల్ రాజీనామా తర్వాత, తృణమూల్ నుండి అనేక ఫిరాయింపులు జరిగాయి.

## బంగ్లాదేశ్‌లో ఆగని దారుణాలు

### -హిందూ దివ్యాంగురాలుపై సామూహిక అత్యాచారం

**ఢాకా,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ):** బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు, అకృత్యాలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. తాజాగా మరో దారుణం చోటుచేసుకుంది. చాంద్‌పుర్ జిల్లాలో హిందూ మహిళపై ముగ్గురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో ఒంటరిగా ఉన్న దివ్యాంగురాలైన మహిళను బలవంతంగా ఎత్తుకెళ్లి దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. నిర్మానుష్య ప్రాంతంలో స్పృహ కోల్పోయి ఉన్న మహిళను గుర్తించిన స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. స్థానికంగా నివాసం ఉండే రకీబ్, సోహైల్, రస్సెల్ అనే ముగ్గురు వ్యక్తులు తనపై అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు పేర్కొంది. వారు తనను తీవ్రంగా హింసించి గాయపరిచినట్లు తెలిపింది. ఇప్పటి వరకు పోలీసులు నిందితులను అరెస్టు చేయకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ హిందూ సంఘాలు, మానవ హక్కుల కార్యకర్తలు నిరసనలకు దిగారు.

## మలుపు తిరిగిన కన్నడ రాజకీయాలు

### మంత్రి పదవులు కోరుతూ 31 మంది లేఖ

**బెంగళూరు,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ):** కర్ణాటకలో నాయకత్వ మార్పు కోసం జరుగుతున్న పోరు మరో మలుపు తిరిగింది. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో తమకు చోటు కల్పించాలని కోరుతూ తొలిసారి గెలిచిన 31 మందికి పైగా ఎమ్మెల్యేలు పార్టీ అధిష్టానానికి సోమవారంనాడు లేఖ రాశారు. లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను ఉద్దేశించి ఎమ్మెల్యేలు ఈ లేఖ రాశారు. కర్ణాటక ప్రజలు కాంగ్రెస్ పార్టీ నుంచి 38 మంది కొత్త వారిని ఎమ్మెల్యేలుగా అసెంబ్లీకి పంపిన విషయం మీకు తెలుసు. తద్వారా అసెంబ్లీలో కొత్త వారిని చూడాలని అనుకుంటున్నట్లు ప్రజలు స్పష్టమైన సందేశాన్నిచ్చారని అధిష్టానానికి రాసిన లేఖలో ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. అయితే మంత్రివర్గంలో 34 మందికి చోటు కల్పించినప్పటికీ కొత్తగా ఎన్నికైన ఒక్క ఎమ్మెల్యేకు కూడా అవకాశం కల్పించలేదని అన్నారు.

ఆ దృష్ట్యా తొలిసారి ఎన్నికైన సమర్థత కలిగిన యువ ఎమ్మెల్యేలకు మంత్రులుగా సేవ చేసే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.పార్టీ అధిష్ఠానానికి రాసిన లేఖపై సంతకాలు చేసిన ఎమ్మెల్యేలలో ఏఎస్ పొన్నన్న, అశోక్ రాయ్, శ్రీనివాస్ ఎన్‌టీ, పి.రవికుమార్, ఏసీ శ్రీనివాస్, హెచ్‌ఏ ఇక్బాల్ హుస్సేన్, బి.దేవేంద్ర, నారా భరత్ రెడ్డి, విశ్వాస్ వి వైద్య, బసవరాజ్ వి శివగంగ తదితరులు ఉన్నారు.




# టీమిండియా ఓటమికి ఆ రెండు తప్పిదాలే కారణం..

### - టీమిండియాపై మాజీ ప్లేయర్ రవిచంద్రన్ అశ్విన్ ఫైర్

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ):** దక్షిణాఫ్రికాతో జరిగిన సూపర్ 8 పోరులో భారత్ 76 పరుగుల భారీ తేడాతో ఓడిపోయింది. ఈ ఓటమి భారత సెమీఫైనల్ అవకాశాలను సంక్లిష్టంగా మార్చడమే కాకుండా, జట్టు ఎంపిక, బ్యాటింగ్ క్రమంపై తీవ్ర విమర్శలకు దారితీసింది. అశ్విన్ తన విశ్లేషణలో ప్రధానంగా అక్షర్ పటేల్‌ను జట్టు నుండి తొలగించడం, రింకూ సింగ్‌ను 8వ నంబర్‌లో బ్యాటింగ్‌కు పంపడం అనేవి జట్టు సమతూకాన్ని దెబ్బతీశాయని పేర్కొన్నారు.జట్టు యాజమాన్యం మ్యాచ్-అప్‌ల పేరుతో అక్షర్ పటేల్‌ను పక్కన పెట్టి వాషింగ్టన్ సుందర్‌ను జట్టులోకి తీసుకోవడాన్ని అశ్విన్ తప్పుబట్టారు. ఐపీఎల్ వంటి సుదీర్ఘ టోర్నీలలో మ్యాచ్-అప్‌లు పని చేస్తాయని, కానీ ప్రపంచకప్ వంటి ఐసీసీ టోర్నీలలో జట్టు స్థిరత్వం చాలా ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. టీ20 క్రికెట్‌లో అక్షర్ పటేల్ టీమ్ ఇండియాకు 'మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్'అని, గత ప్రపంచకప్‌లో కూడా దక్షిణాఫ్రికాపై ఒత్తిడిలో ఆయన అద్భుత ప్రదర్శన చేశారని అశ్విన్ గుర్తు చేశారు.సమతూకం దెబ్బతింది: అక్షర్ లేకపోవడం వల్ల మిడిల్ ఓవర్లలో జట్టుకు ఉండాల్సిన ఎడమచేతి వాటం బ్యాటింగ్ బలం తగ్గిందని, ఇది దక్షిణాఫ్రికా స్పిన్నర్లు ఆధిపత్యం చెలాయించేలా చేసిందని ఆయన విశ్లేషించారు. మరో ముఖ్యమైన తప్పిదం రింకూ సింగ్‌ను 8వ స్థానంలో బ్యాటింగ్‌కు పంపడం అని అశ్విన్ అన్నారు. ఫినిషర్‌గా పేరున్న రింకూకు తగినన్ని ఓవర్లు లభించకపోవడం వల్ల భారత బ్యాటింగ్ భారీ స్కోరును సాధించలేకపోయిందని లేదా లక్ష్య ఛేదనలో వెనుకబడిందని ఆయన పేర్కొన్నారు. బ్యాటింగ్ ఆర్డర్‌లో నిరంతరం మార్పులు చేయడం వల్ల ఆటగాళ్ళలో అభద్రతాభావం ఏర్పడుతుందని, అది వారి సహజ సిద్ధమైన ఆటను దెబ్బతీస్తుందని అశ్విన్ హెచ్చరించారు.బ్యాటర్ల టెక్నిక్ గురించి కూడా అశ్విన్ ఘాటుగా స్పందించారు. భారత బ్యాటర్లు స్పిన్‌ను ఎదుర్కోవడంలో ప్రపంచంలోనే అత్యంత బలహీనంగా తయారయ్యారని ఆయన వ్యాఖ్యానించారు. డిఫెన్స్ లేకపోవడం: భారత బ్యాటర్లు తమ డిఫెన్స్‌పై నమ్మకం ఉంచకుండా కేవలం భారీ షాట్లపైనే ఆధారపడుతున్నారని, ఇది తిరిగే పిచ్‌లపై ప్రమాదకరమని అన్నారు. దక్షిణాఫ్రికా స్పిన్నర్లు వికెట్లు తీస్తుంటే మన బ్యాటర్లు స్వీప్ లేదా రివర్స్ స్వీప్ షాట్లను ఆడలేకపోయారని, ఇది వారి సాంకేతిక లోపాలను ఎత్తిచూపుతోందని విమర్శించారు. మొత్తంగా, దక్షిణాఫ్రికా జట్టు సరైన ప్రణాళికలతో వచ్చి భారత్‌ను చిత్తు చేసిందని, టీమ్ ఇండియా మాత్రం వ్యూహాత్మక గందరగోళంతో ఓటమిని కొనితెచ్చుకుందని అశ్విన్ తన రివ్యూలో కుండబద్దలు కొట్టారు.

# టీమ్ఇండియా అత్యంత చెత్త ఓటములు ఇవే..




**న్యూఢిల్లీ,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ):** డిఫెండింగ్ ఛాంపియన్‌గా టీ20 వరల్డ్‌కప్ బరిలో దిగిన టీమ్ఇండియాకు సూపర్ 8 తొలి మ్యాచ్‌లోనే షాక్ తగిలింది. సౌతాఫ్రికాతో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ ఘోర ఓటమి చవిచూసింది. తొలుత బంతితో, ఆ తర్వాత బ్యాటుతో పూర్తిగా విఫలమైన టీమ్ఇండియా కీలక పోరులో 76 పరుగుల తేడాతో ఓడి సెమీఫైనల్ అవకాశాలు సంక్లిష్టం చేసుకుంది. దీంతో తదుపరి రెండు మ్యాచ్‌ల్లోనూ తప్పక నెగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ టోర్నీలో గ్రూప్ దశలో ఓటమి లేకుండానే టీమ్ఇండియా సూపర్ 8కు దూసుకొచ్చింది. వరుసగా యూఎస్ఏ, నమీబియా, పాకిస్థాన్, నెదర్లాండ్స్‌పై విజయం సాధించింది. దీంతో ఇక్కడ కూడా భారత్ అదే ఫలితాలు రిపీట్ చేయాలని అభిమానులు భావించారు. కానీ, సూపర్ 8 మొదటి మ్యాచ్‌లోనే గట్టి ఎదురుదెబ్బ తగలడంతో నిరాశ చెందారు. వరల్డ్ ఛాంపియన్ జట్టు ఘోర ఓటమిపాలవ్వడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా తప్పులు సరిదిద్దుకొని వరుస విజయాలు సాధించి సెమీస్?కు చేరాలని ఆశిస్తున్నారు. టీమ్ఇండియా సూపర్ కమ్‌బ్యాక్ ఇవ్వాలని కోరుకుంటున్నారు. అయితే గతంలోనూ టీ20 వరల్డ్‌కప్‌లో భారత్ భారీ పరాజయాలు మూటగట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. ఆయా మ్యాచ్‌ల్లో ఓటమిపాలై ఆ తర్వాత పుంజుకున్న సందర్భాలూ ఉన్నాయి. టీమ్ఇండియా 2016 టీ20 వరల్డ్‌కప్‌ను ఊహించని ఓటమితో ఆరంభించింది. ఆ ఎడిషన్‌లో తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌ను భారత్ ఢీ కొట్టింది. తొలుత బౌలింగ్ చేసిన టీమ్ఇండియా కివీస్‌ను 126-7 స్కోరుకే పరిమితం చేసింది. దీంతో భారత్ అలవోకగా గెలిచేస్తుందని ఫ్యాన్స్ అనుకున్నారు. కానీ, అనుకున్నట్లు ఛేదన జరగలేదు. స్వల్ప లక్ష్యాన్ని భారత్ అందుకోలేదు. 18.1 ఓవర్లలో కేవలం 79 పరుగులకే ఆలౌటై ఘోర ఓటమిని మూటగట్టుకుంది. ధోని (30), విరాట్ (23), అశ్విన్ (10) ముగ్గురే రెండంకెల స్కోర్ చేశారు. పొట్టి కప్పులో భారత్‌కు ఇది అత్యంత ఘోర ఓటమి. అయితే ఆ తర్వాత టీమ్ఇండియా కమ్‌బ్యాక్ ఇచ్చింది. అదిరే ఆటతో సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. కానీ అక్కడ వెస్టిండీస్‌తో ఓడింది. 2014 ఎడిషన్?లో భారత్ తమ మూడో మ్యాచ్ ఆస్ట్రేలియాతో ఆడింది. ఇందులో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ కష్టాలు పడుతూ 20 ఓవర్లలో 140-7 స్కోర్ చేసింది. ఇర్ఫాన్ (31), రైనా (26) టాప్ స్కోరర్లు. అయితే పిచ్ బ్యాటింగ్‌కు కఠినంగా ఉందని అంతా భావించారు. కానీ, ఛేదనలో సీన్ రివర్స్ అయ్యింది. తొలుత పరుగులు చేసేందుకు టీమ్ఇండియా అష్టకష్టాలు పడ్డ అదే పిచ్‌పై ఆసీస్ బ్యాటర్లు చెలరేగిపోయి ఆడడం గమనార్హం. ఒకే వికెట్ కోల్పోయి 14.5 ఓవర్లలోనే ఈ టార్గెట్‌ను ఛేదించి గ్రాండ్ విక్టరీ కొట్టింది. 2022 ఎడిషన్‌లో రోహిత్ శర్మ సారథ్యంలో టీమ్ఇండియా సెమీఫైనల్‌లో అడుగుపెట్టింది. అక్కడ ఇంగ్లాండ్‌ను ఢీ కొట్టింది. అయితే ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 168-6 స్కోర్ చేసింది. హార్దిక్ పాండ్య, విరాట్ కోహ్లీ చెరో హాఫ్ సెంచరీ సాధించారు. కానీ ఛేజింగ్‌లో ఇంగ్లాండ్ జెట్ స్పీడ్‌తో రెచ్చిపోయింది. ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా 16 ఓవర్లలోనే ఇంగ్లాండ్ ఈ టార్గెట్‌ను ఛేదించేసింది. ఓపెనర్లు బట్లర్ (80), అలెక్స్ హేల్స్ (86) చెలరేగి ఆడారు. వీళ్ల బ్యాటింగ్‌కు టీమ్ఇండియా బౌలర్లు కళ్లెం వేయలేకపోయారు వన్‌సైడ్‌గా సాగిపోయిన ఈ మ్యాచ్‌లో భారత్ అసలు పోటీ కూడా ఇవ్వలేకపోయింది. పొట్టి కప్పు హిస్టరీలో భారత్‌కు ఇదే అత్యంత ఘోర ఓటమి అని చెప్పవచ్చు!ఐసీసీ టోర్నీల్లో పాకిస్థాన్‌పై అప్పటిదాకా ఘనమైన రికార్డ్ ఉంది. 100శాతం విజయాలతో టీమ్ఇండియా ట్రాక్ రికార్డ్ ఘనంగా ఉంది. కానీ, 2021లో భారత్ తొలిసారి టీ20 వరల్డ్‌కప్‌లో పాక్‌పై ఓటమి చవిచూసింది. దుబాయ్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. భారత్ 152 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అయితే ఈ టార్గెట్‌ను పాక్ ఓపెనర్లు మహ్మద్ రిజ్వాన్ (79), బాబర్ అజామ్ (68) 17.5 ఓవర్లలోనే కొట్టేశారు. ఈ మ్యాచ్ ఓటమి టీమ్ఇండియా అభిమానులను తీవ్రంగా కలిచివేసింది. అలా 2021,2022 వరుస ఎడిషన్లలో పాక్, ఇంగ్లాండ్‌పై భారత్ ఓటములు అభిమానులను బాధించాయి. కానీ ఆ తర్వాత పాక్‌తో జరిగిన అన్ని ఐసీసీ ఈవెంట్లో (ప్రస్తుత వరల్డ్‌కప్ సహా)నూ భారత్ ఘన విజయం సాధించింది.

## అత్యధిక సార్లు డకౌట్ అయిన భారత ఆటగాళ్ల జాబితా

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ):** టీమిండియా డిఫెండింగ్ ఛాంపియన్‌గా టీ20 వరల్డ్ కప్ 2026 బరిలోకి దిగింది. అయితే ఈ ప్రపంచ కప్ లో టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ వరుసగా 3 మ్యాచులలో డకౌట్ అయ్యాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన సూపర్ 8 మ్యాచులో మరో ఓపెనర్ ఇషాన్ కిషన్ డకౌట్ అయ్యాడు. అయితే టీ20ల్లో టాప్ బ్యాటర్లుగా అయినప్పటికీ అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ సైతం ఐసీసీ ఇంటర్నేషనల్ క్రికెట్‌లో అత్యధిక డకౌట్లు అయిన బ్యాటర్ల జాబితాలో ఉన్నారు. ఇండియాకు చెందిన కొందరు దిగ్గజ బ్యాటర్ల పేరిట అత్యధిక 'డక్' (0 పరుగులకే అవుట్ కావడం) అయిన రికార్డులు ఉన్నాయి.ఈ జాబితాలో అందరికంటే ముందు టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఉన్నాడు. 2007 నుండి 2024 వరకు 159 టీ20 మ్యాచ్‌లు ఆడిన హిట్ మ్యాన్ రోహిత్, 12 సార్లు డకౌట్ అయ్యాడు. రోహిత్ 140 కంటే ఎక్కువ స్ట్రైక్ రేట్‌తో 4231 పరుగులు చేశాడు. అయితే, టీ20 వంటి ఫార్మాట్‌లో దూకుడుగా ఆడటం వల్ల ఓపెనర్లు త్వరగా అవుట్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది.ఈ విషయంలో రెండో స్థానంలో వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ ఉన్నాడు. శాంసన్ 2015 నుండి 2026 మధ్య ఆడిన 58 మ్యాచ్‌లలో 7 సార్లు ఖాతా తెరవకుండానే ఔటయ్యాడు. శాంసన్ 1100 పరుగులు చేయగా, అతడి స్ట్రైక్ రేట్ దాదాపు 149గా ఉంది. శాంసన్ సాధారణంగా డాషింగ్ ఇన్నింగ్స్ ఆడతాడు. కానీ త్వరగా వికెట్లు సమర్పించుకోవడం అతడికి మైనస్ పాయింట్. టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ కూడా ఈ జాబితాలో ఉన్నాడు. కోహ్లీ 2010 నుండి 2024 వరకు 125 టీ20 మ్యాచ్‌లలో 7 సార్లు ఖాతా తెరవకుండానే ఔటయ్యాడు. అయినప్పటికీ కోహ్లీ పేరిట 4,188 పరుగులు ఉన్నాయి. అతడి సగటు దాదాపు 49గా ఉంది. ఈ ఫార్మాట్‌లోనూ కోహ్లీ బెస్ట్ బ్యాటర్ గా కొనసాగాడు. ఇటీవల టీ20 వరల్డ్ కప్‌లో పేలవమైన ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న అభిషేక్ శర్మ కూడా ఈ జాబితాలోకి వచ్చేశాడు. యువ ఓపెనర్ 2024 నుండి 2026 మధ్య ఆడిన 41 మ్యాచ్‌లలో 6 సార్లు డకౌట్ అయ్యాడు. అభిషేక్ స్ట్రైక్ రేట్ 190 కంటే ఎక్కువగా ఉండటం అతడి దూకుడు బ్యాటింగ్ శైలిని తెలుపుతుంది. ఈ వరల్డ్ కప్ లోనే 3 సార్లు అభిషేక్ ఖాతా తెరవకుండా వికెట్ కోల్పోయాడు.ఇండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఈ అవాంఛనీయ జాబితాలో చోటు దక్కించుకున్నాడు. సూర్య 2021 నుండి 2026 వరకు ఆడిన 108 మ్యాచ్‌లలో 6 సార్లు డకౌట్ అయ్యాడు. ఇటీవల వరుసగా డకౌట్లు, విఫలమైన సూర్య మళ్లీ పుంజుకున్నాడు. అయినప్పటికీ, సూర్యకుమార్ యాదవ్ 3192 పరుగులు చేశాడు. ఎన్నో మ్యాచ్‌లలో టీమిండియాను గెలిపించాడు.

## వాంఖడేలో హిట్మేయర్ ఊచకత..



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ):** ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్--8 దశలో వెస్టిండీస్ ఐం జింబాబ్వే మధ్య జరుగుతున్న కీలక మ్యాచ్ క్రికెట్ అభిమానులను ఉత్కంఠకు గురిచేస్తోంది. ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ స్టార్ బ్యాటర్ షిమ్రాన్ హెట్‌మైయర్ కేవలం 19 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసి స్టేడియాన్ని ఉర్రూతలూగించాడు. అతడి మెరుపు ఇన్నింగ్స్‌తో వెస్టిండీస్ స్కోర్ బోర్డు వేగంగా దూసుకెళ్తోంది. టాస్ గెలిచిన జింబాబ్వే ముందుగా బౌలింగ్ ఎంచుకోగా, వెస్టిండీస్ బ్యాటింగ్ ప్రారంభించింది. పవర్‌ప్లేలో కొంత ఒత్తిడి ఎదురైనా, మిడిల్ ఓవర్లలో హెట్‌మైయర్ క్రీజ్‌లోకి దిగిన వెంటనే మ్యాచ్ సీన్ పూర్తిగా మారిపోయింది. స్పిన్నర్లపై దూకుడుగా, పేసర్లపై పవర్ ఫుల్ షాట్లతో అతడు బౌండరీల వర్షం కురిపించాడు. కేవలం 19 బంతుల్లోనే అర్ధశతకం సాధించడం ఈ వరల్డ్ కప్‌లో వెస్టిండీస్ తరఫున వేగవంతమైన అర్ధశతకాలలో ఒకటిగా నిలిచింది. హెట్‌మైయర్ 5 వరుస సిక్సర్లు, 5 ఫోర్లు బాదడంతో జింబాబ్వే బౌలర్లపై తీవ్ర ఒత్తిడి ఏర్పడింది. మరో వైపు బ్యాటింగ్ చేసిన సహచరులు కూడా స్థిరంగా నిలబడి భాగస్వామ్యాన్ని నిర్మించడంతో వెస్టిండీస్ భారీ స్కోర్ దిశగా దూసుకెళ్లింది. డెత్ ఓవర్లలో మరింత దూకుడు చూపితే వెస్టిండీస్ 180o స్కోర్ దాటే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు జింబాబ్వే బౌలర్లు పవర్‌ప్లేలో చూపిన క్రమశిక్షణను మిడిల్ ఓవర్లలో కొనసాగించలేకపోయారు. ముఖ్యంగా హెట్‌మైయర్ వేగంగా పరుగులు చేయడంతో మ్యాచ్‌పై వెస్టిండీస్ పట్టు సాధించింది. లక్ష్య ఛేదనలో జింబాబ్వే బ్యాటింగ్ ఎలా స్పందిస్తుందన్నది ఇప్పుడు మ్యాచ్ ఫలితాన్ని నిర్ణయించనుంది.

## చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో హార్దిక్, మహికా సందడి

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ):** టీ20 వరల్డ్ కప్ 2026 రసవత్తరంగా సాగుతున్న తరుణంలో టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మైదానంలో కంటే మైదానం బయటే ఎక్కువగా వార్తల్లో నిలుస్తున్నాడు. హార్దిక్ పాండ్యా తన కొత్త గర్ల్‌ఫ్రెండ్, నటి మహికి శర్మతో రిలేషన్‌లో ఉన్నాడనే వార్తలు ఇప్పుడు అధికారికంగా ధ్రువీకరించబడినట్లు కనిపిస్తోంది. టోర్నీ ప్రారంభం నుంచి టీమిండియా ఎక్కడికి వెళ్తే మహికి అక్కడే ప్రత్యక్షమవుతోంది. తాజాగా భారత జట్టు తన తదుపరి మ్యాచ్ కోసం చెన్నై చేరుకోగా, ఎయిర్‌పోర్ట్‌లో హార్దిక్ తన ప్రియురాలి భుజంపై చేయి వేసి నడుస్తున్న ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. దీంతో వీరిద్దరి ప్రేమాయణం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. వ్యక్తిగత జీవితం సంగతి పక్కన పెడితే, హార్దిక్ పాండ్యా ఆటతీరుపై మాత్రం తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకోవాల్సిన సీనియర్ ప్లేయర్, మైదానంలో మాత్రం చేతులెత్తేస్తున్నాడనే ఆగ్రహం అభిమానుల్లో కనిపిస్తోంది. గ్రూప్ స్టేజ్‌లో నమీబియా వంటి చిన్న జట్టుపై ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన హార్దిక్, అసలైన సూపర్ 8 పోరులో మాత్రం విఫలమయ్యాడు. సౌతాఫ్రికాతో జరిగిన కీలక మ్యాచ్‌లో బౌలింగ్‌లో 4 ఓవర్లలో ఏకంగా 45 పరుగులు సమర్పించుకోవడమే కాకుండా, బ్యాటింగ్‌లో కూడా 17 బంతుల్లో కేవలం 18 పరుగులు మాత్రమే చేసి ఒత్తిడిలో నిలబడలేకపోయాడు. హార్దిక్ పాండ్యా తన ప్రియురాలి పుట్టినరోజు వేడుకలను కూడా అహ్మదాబాద్‌లోని టీమ్ హోటల్‌లో ఘనంగా నిర్వహించాడు. జట్టులోని ఇతర సభ్యులు కూడా ఈ వేడుకల్లో పాల్గొన్నట్లు తెలుస్తోంది. అయితే, అభిమానుల ప్రశ్న మాత్రం ఒక్కటే.. రొమాన్స్ ఓకే.. కానీ టీమిండియాను ఎప్పుడు గెలిపిస్తావు హార్దిక్. భారీ అంచనాల మధ్య బరిలోకి దిగిన పాండ్యా, ఇప్పటివరకు పెద్ద జట్లపై తన మార్కు చూపించలేకపోయాడు. బౌలింగ్‌లో పరుగులు నియంత్రించలేకపోవడం, బ్యాటింగ్‌లో స్ట్రైక్ రేట్ మందగించడం జట్టు విజయవకాశాలను దెబ్బతీస్తోంది.తదుపరి మ్యాచ్ జింబాబ్వేతో చెన్నైలోని చేపాక్ స్టేడియంలో జరగనుంది. ఇప్పటికే మహికా శర్మ చెన్నై చేరుకోవడంతో, ఈ మ్యాచ్‌లోనైనా హార్దిక్ బ్యాట్‌తో లేదా బంతితో విన్యాసాలు చేస్తాడో లేదో చూడాలి. ఒక ప్రొఫెషనల్ క్రికెటర్‌గా తన ప్రధాన బాధ్యత దేశాన్ని గెలిపించడమేనని హార్దిక్ గుర్తించాలని మాజీ క్రికెటర్లు సైతం సూచిస్తున్నారు. మరి జింబాబ్వేపై అయినా ఈ స్టార్ ప్లేయర్ తన పాత ఫామ్ అందుకుని విమర్శకుల నోళ్లు మూయిస్తాడో లేదో వేచి చూడాలి.

# టీమిండియా జట్టులో కీలక మార్పులు?

### - సౌతాఫ్రికా చేతిలో పరాజయంతో నిర్ణయం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ):** టీ20 వరల్డ్ కప్ 2026లో భాగంగా అహ్మదాబాద్‌లో సౌతాఫ్రికా చేతిలో ఎదురైన ఘోర పరాజయం టీమిండియాను ఆలోచనలో పడేసింది. ఈ ఓటమి నేర్పిన పాఠాలతో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, కోచ్ ఇప్పుడు జట్టులో కీలక మార్పులకు సిద్ధమవుతున్నారు. సూపర్-8లో భారత్ తన తదుపరి పోరులో జింబాబ్వేను ఎదుర్కోనుంది. ఈ మ్యాచ్ చెన్నైలోని ప్రతిష్టాత్మక ఎం.ఏ.చిదంబరం స్టేడియం (చెపాక్) వేదికగా జరగనుంది. చెన్నై పిచ్ స్వభావం దృష్ట్యా భారత ప్లేయింగ్ ఎలెవన్‌లో భారీ మార్పులు ఉండబోతున్నాయని సమాచారం. చెపాక్ స్టేడియం అంటేనే స్పిన్నర్ల స్వర్గధామం. ఇక్కడ బంతి బాగా టర్న్ అవుతుంది కాబట్టి, భారత్ ముగ్గురు స్పెషలిస్ట్ స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశం ఉంది. గత మ్యాచ్‌లో దూరమైన స్టార్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ తిరిగి జట్టులోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది. వాషింగ్టన్ సుందర్ స్థానంలో అక్షర్ జట్టులోకి వస్తే బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ బలం పెరుగుతుందని మేనేజ్మెంట్ భావిస్తోంది. అలాగే ప్రత్యర్థి బ్యాటర్లను తన మాయాజాలంతో తిప్పికొట్టేందుకు చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్ కూడా తుది జట్టులోకి వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. మరోవైపు, యువ ఓపెనర్ అభిషేక్ శర్మ ఫామ్ ఇప్పుడు జట్టుకు తలనొప్పిగా మారింది. ఈ వరల్డ్ కప్‌లో అతను వరుసగా విఫలమవుతుండటంతో, అతని స్థానంలో సంజూ శామ్సన్‌ను ఆడించాలనే డిమాండ్లు గట్టిగా వినిపిస్తున్నాయి. అయితే కీలకమైన మ్యాచ్ కావడంతో అనుభవం లేని ప్రయోగాలు చేయకుండా, అభిషేక్ శర్మపైనే మేనేజ్మెంట్ మరోసారి నమ్మకం ఉంచేలా కనిపిస్తోంది. జింబాబ్వేను తక్కువ అంచనా వేయడం భారత్‌కు ప్రాణసంకటమే. ఎందుకంటే గ్రూప్ దశలో ఆస్ట్రేలియా, శ్రీలంక వంటి దిగ్గజ జట్లకే చెమటలు పట్టించి సూపర్-8కు చేరిన ఘనత ఆ జట్టుది. ముఖ్యంగా వారి స్పిన్నర్లు ఈ టోర్నీలో అద్భుతంగా రాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో చెన్నై పిచ్‌పై భారత్ ఎంతో జాగ్రత్తగా ఆడాల్సి ఉంటుంది. నెట్ రన్ రేట్ దెబ్బతినకుండా ఉండాలంటే, జింబాబ్వేపై భారీ విజయం సాధించడం సూర్య సేనకు అనివార్యం.

**జింబాబ్వే పై భారత్ ప్లేయింగ్ ఎలెవన్ (అంచనా) :**

అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ / వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, అర్షదీప్ సింగ్, జస్ప్రీత్ బుమ్రా

# టీమిండియా సెమీ-ఫైనల్ అవకాశాలు సంక్లిష్టం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ):** టీ20 వరల్డ్‌కప్‌లో భారత్‌కు అనూహ్యమైన భారీ షాక్ తగిలింది. ఆదివారం నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరిగిన సూపర్ 8 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా చేతిలో టీమిండియా 76 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది. ఈ ఘోర పరాజయం భారత జట్టు సెమీ-ఫైనల్ అవకాశాలను తీవ్రంగా సంక్లిష్టం చేసింది. కేవలం ఓటమి మాత్రమే కాకుండా, భారీ తేడాతో ఓడిపోవడంతో భారత జట్టు నెట్ రన్ రేట్ఘోరంగా దెబ్బతింది. ప్రస్తుతం టీమిండియా నెట్ రన్ రేట్ -3.800గా నమోదైంది. ఇది సెమీస్ రేసులో భారత్‌కు తీవ్ర ప్రతికూలంగా మారింది. టీమిండియా సెమీ-ఫైనల్స్‌కు అర్హత సాధించాలంటే, మిగిలి ఉన్న రెండు సూపర్ 8 మ్యాచ్‌లలో భారీ విజయాలు సాధించడం తప్పనిసరి. భారత్ తమ తదుపరి మ్యాచ్‌లలో వెస్టిండీస్, జింబాబ్వే జట్లతో తలపడనుంది. ఈ రెండు మ్యాచ్‌లలో విజయాలు సాధించడం ద్వారా భారత్ ఖాతాలో నాలుగు పాయింట్లు వచ్చి చేరతాయి. అయితే, కేవలం విజయాలు మాత్రమే సరిపోవు. నెట్ రన్ రేట్‌ను మెరుగుపరుచుకోవడం అత్యవసరం, ఎందుకంటే గ్రూప్‌లో ఇతర జట్లు కూడా నాలుగు పాయింట్లతో ముగించే అవకాశం ఉంది. అలాంటి పరిస్థితులలో, మెరుగైన నెట్ రన్ రేట్ కలిగిన జట్టే సెమీ-ఫైనల్స్‌కు అర్హత సాధిస్తుంది. ఈ మ్యాచ్ ఓడిపోవడంతో భారత్ పూర్తిగా ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవేళ భారత్ మిగిలిన రెండు మ్యాచ్‌లలో విజయం సాధించినా, మరో రెండు జట్లు కేవలం రెండు పాయింట్లు మాత్రమే సాధిస్తే భారత్ సెమీస్‌కు చేరుకుంటుంది. అయితే, ఒకవేళ మరో రెండు జట్లు కూడా నాలుగు పాయింట్లతో ఉంటే, అప్పుడు టీమిండియాకు సెమీస్ చేరడం కష్టమవుతుంది. ఈ సంక్లిష్ట పరిస్థితులలో టీమిండియా తన నెట్ రన్ రేట్‌ను సాధ్యమైనంత మేరకు మెరుగుపరుచుకోవడంపై దృష్టి సారించాలి.

# వద్దే వద్దంటున్న అజిత్ ఫ్యాన్స్




తమిళ టాప్ స్టార్లలో ఒకడైన అజిత్‌కు వీరం, వేదాళం, విశ్వాసం చిత్రాలతో మరపురాని విజయాలు అందించాడు దర్శకుడు శివ. తమిళంలో ఒకప్పుడు పేరున్న సినిమాటోగ్రాఫర్ అయిన శివ.. తెలుగులో దర్శకుడిగా పరిచయం కావడం విశేషం. గోపీచంద్ హీరోగా శౌర్యం, శంఖం సినిమాలు తీశాడతను. తర్వాత సొంత భాషలో 'విక్రమార్కుడు' సినిమాను 'సిరుత్తై' పేరుతో రీమేక్ చేస్తే అది పెద్ద హిట్టయింది. ఆపై అతను సొంత కథలతో వీరం, వేదాళం, వివేగం, విశ్వాసం సినిమాలు తీశాడు. ఇందులో వివేగం మినహా సినిమాలు బ్లాక్ బస్టర్లు అయ్యాయి. ఐతే అజిత్‌కు మూడు హిట్లు ఇచ్చినా సరే.. తన విషయంలో అజిత్ ఫ్యాన్స్ నుంచి మిశ్రమ స్పందన వస్తుంటుంది. అజిత్‌ను ఒక మూసలోకి తీసుకెళ్లిపోయాడని.. రొటీన్ సినిమాలు తీసి విసిగించాడని అంటుంటారు. ఐతే అజిత్ కాకుండా శివ వేరే హీరోలతో సినిమాలు తీస్తే అస్సలు వర్కవుట్ కాలేదు. సూపర్ స్టార్ రజినీకాంత్‌తో తీసిన 'అన్నాత్తే', సూర్యతో చేసిన 'కంగువ' ఒకదాన్ని మించి ఒకటి డిజాస్టర్లు అయ్యాయి. దీంతో శివ పట్ల కోలీవుడ్లో బాగా వ్యతిరేకత వచ్చేసింది. తనతో సినిమా చేయడానికి స్టార్లు ఇప్పుడు భయపడుతున్నారు. ఇలాంటి టైంలో అజిత్ మళ్లీ అతడికి అవకాశమిచ్చినట్లుగా వార్తలు వస్తున్నాయి. వరుస ఫ్లాపుల తర్వాత గత ఏడాది 'గుడ్ బ్యాడ్ అగ్లీ'తో హిట్ ట్రాక్ ఎక్కాడు అజిత్. ఆ సినిమా అభిమానులకు గొప్ప ఊరటనిచ్చింది. ఐతే ఆ సినిమా తీసిన ఆధిక్ రవిచంద్రన్‌తోనే ఇంకో సినిమాను అజిత్ లైన్లో పెట్టాడు. కానీ ఇప్పుడేమో లైనప్ మారిందంటున్నారు. మధ్యలోకి శివ సినిమా వచ్చిందని.. దాన్నే ముందుకు తీసుకెళ్తున్నాడని.. ఆ తర్వాతే ఆధిక్ సినిమా ఉంటుందని అంటున్నారు. కానీ అజిత్ ఫ్యాన్స్ దీని పట్ల నెగెటివ్‌గా స్పందిస్తున్నారు. శివ మళ్లీ రొటీన్ సినిమా తీస్తాడని.. ఫామ్‌లో లేని అతడితో మళ్లీ జట్టు కట్టడం అవసరమా అని ప్రశ్నిస్తున్నారు. లేక లేక ఒక పెద్ద హిట్ ఇచ్చిన ఆధిక్‌ను వదిలేసిన శివతో వెళ్లడాన్ని వాళ్లు అంగీకరించలేకపోతున్నారు. మారుతితో ప్రభాస్ సినిమా చేస్తుంటే ఫ్యాన్స్ వ్యతిరేకించినట్లే.. అజిత్ అభిమానులు కూడా ఇప్పుడు శివ సినిమా విషయంలో నెగెటివ్‌గా స్పందిస్తున్నారు.



## బలవంత్ బిజినెస్ వర్కౌట్ అయ్యిందా



మొన్న శుక్రవారం విడుదలైన సినిమాల్లో ప్రమోషన్ల పరంగా బాగా హడావిడి చేసింది హే బలవంత్ ఒక్కటే. మిగిలినవి కూడా పబ్లిసిటీ చేశాయి కానీ దీని మీద వచ్చిన అటెన్షన్ వేరేవాటికి రాలేదన్నది వాస్తవం. అయితే ఫోకస్ బాగానే పడింది కానీ బాక్సాఫీస్ దగ్గర బలవంత్ సౌండ్ ఏమంత బిగ్గరగా లేదు. నిన్న ఆదివారం అయినప్పటికీ చాలా చోట్ల ఆక్యుపెన్సీలు సగం కంటే తక్కువ స్థాయిలో ఉన్నాయి. సాయంత్రం క్రికెట్ మ్యాచ్ ప్రభావం కొంత ఉందనుకున్నా.. ఉదయం, మధ్యాన్నం షోలలో కూడా మేజిక్ జరగలేదు. హైదరాబాద్ లాంటి నగరాల్లో జనాలు కనిపించగా బిసి సెంటర్స్ లో మాత్రం బలవంత్ ఎదురీదుతున్న వైనం స్పష్టం. ముఖ్యంగా బిజినెస్ బిజినెస్ అంటూ టీమ్ తెగ ఊదరగొట్టిన పాయింటే ఫ్యామిలీ ఆడియన్స్ ని దూరం చేసినట్టుగా కనిపిస్తోంది. దర్శక నిర్మాతలకు అది క్రియేటివ్ గా అనిపించి ఉండొచ్చు కానీ నరేష్ తో చేయించిన వ్యాపారం ఏదైతే ఉందో అది కుటుంబాలు అంగీకరించేది కాదు. దానికి జస్టిఫికేషన్, ఎమోషన్స్ తగినంత జోడించినా అవి పూర్తి కన్విన్సింగ్ గా లేకపోగా సదరు బిజినెస్ ని సమర్ధించుకునేందుకు పడిన ప్రయాస ప్రభావం చూపించింది. ట్రేడ్ టాక్ ప్రకారం వీకెండ్ వరకు హే బలవంత్ వరల్డ్ వైడ్ గ్రాస్ అయిదు కోట్లు దాటిందట. ఇలా అయితే బ్రేక్ ఈవెన్ ఇంకా దూరంలో ఉన్నట్టే ఈ శుక్రవారం విష్ణు విన్యాసం రిలీజవుతున్న నేపథ్యంలో హే బలవంత్ వీక్ డేస్ లో ఏం చేస్తుందనేది చూడాలి. బాక్సాఫీస్ తత్వం బోధ పడిందో ఏమో ప్రస్తుతానికి టీమ్ అయితే ప్రచారాన్ని ఆపేసింది. నిర్మాత చెప్పిన ప్రకారం ఓవర్సీస్ లో వన్ మిలియన్ దాటాలి కానీ ప్రస్తుతం సగానికే పోరాడుతున్న వైనం స్పష్టం. అన్ని వర్గాలను మెప్పించే యునానిమాస్ టాక్ వస్తే వేరుగా ఉండేది కానీ ఇలాంటి రెస్పాన్స్ తోనే కొంచెం సమస్య ఉంటుంది. సుహాస్ కోణంలో చూస్తే గ్రాస్ పరంగా తనకిది పెద్ద నెంబర్ అవుతుందా లేదా అనేది వచ్చే వీకెండ్ తో తేలిపోతుంది. రాబోయే రెండు వారాలు శ్రీవిష్ణు డామినేషన్ ఉండటం ఖాయం.

# జననాగయన్... విజయ్ కీలక నిర్ణయం?

అంతా అనుకున్న ప్రకారం జరిగి ఉంటే.. తమిళ టాప్ స్టార్ విజయ్ చివరి చిత్రం 'జననాగయన్' విడుదలై ఆరు వారాలు దాటిపోయి ఉండాలి. కానీ జనవరి 9న సంక్రాంతి కానుకగా రావాల్సిన సినిమా.. సెన్సార్ సమస్యల వల్ల అనూహ్యంగా వాయిదా పడిపోయింది. వాయిదా అంటే రెండు మూడు రోజులే అని ముందు అనుకున్నారు. కానీ వారాలు గడిచినా ఆ సినిమా విడుదల కాలేదు. ఇంకో రెండు నెలల్లో తమిళనాట అసెంబ్లీ ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఫిబ్రవరిలో ఈ చిత్రాన్ని రిలీజ్ చేయడానికి చిత్ర బృందం విశ్వ ప్రయత్నం చేసింది. కానీ కుదరలేదు. ఈ నెలలో రిలీజ్ లేదంటే.. ఇక ఎన్నికలయ్యే వరకు సినిమా రాదని ఫిక్సయిపోవాల్సిందే. త్వరలో తమిళనాట ఎన్నికల కోడ్ రాబోతోంది. ఆ టైంలో ఇలాంటి పొలిటికల్ టచ్ ఉన్న సినిమాను రిలీజ్ చేయడం మరింత కష్టమవుతుంది. కాబట్టి అందరూ ఎన్నికల తర్వాతే ఈ సినిమా వస్తుందని ఒక నిర్ణయానికి వచ్చేశారు. ఏప్రిల్ మధ్యలో ఎన్నికలు జరగనున్నాయి. కాబట్టి వెంటనే ఆ నెల చివర్లో సినిమా రిలీజవుతుందేమో అనుకున్నారు ఫ్యాన్స్. కానీ తాజా సమాచారం ప్రకారం ఎన్నికలు అయిన వెంటనే కూడా సినిమా విడుదల కాబోదట. ఫలితాలు కూడా వచ్చాక, జూన్‌లో మంచి ముహూర్తానికి సినిమా విడుదల కానున్నట్లు తాజా సమాచారం. జూన్ 22న విజయ్ పుట్టిన రోజుకే 'జననాయగన్'ను రిలీజ్ చేయడానికి టీం ఒక నిర్ణయానికి వచ్చిందట. ఎన్నికల కోసం ఈ సినిమాను ఉపయోగించుకోవాలన్న విజయ్ కోరిక ఫలించలేదు. కాబట్టి ఎన్నికలు అయ్యాక ఎప్పుడు రిలీజైనా ఇబ్బంది లేదు. ఐతే ఫలితాలు వచ్చాయంటే అప్పుడు విజయ్ పవర్ ఫుల్ పొజిషన్లో ఉంటాడనే ఒక అంచనా ఉంది. ప్రభుత్వ ఏర్పాటులో కింగ్ మేకర్ అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయి. అప్పుడు



'జననాయగన్'కు సెన్సార్ లేదా ఇంకే విధంగానూ అడ్డంకులు ఉండకపోవచ్చు. అంతకంటే ముందు రిలీజ్ చేస్తే మాత్రం చాలా సీన్లు, డైలాగులకు కత్తెర వేయాల్సి రావచ్చు. కాబట్టి ఆ అవకాశం ఇవ్వకుండా.. ఎన్నికల ఫలితాలు వచ్చాక, ఫ్యాన్స్ బాగా సెలబ్రేట్ చేసుకునే రోజైన జూన్ 22నే ఆ సినిమాను రిలీజ్ చేయడానికి విజయ్ అండ్ కో ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.



# బిజినెస్ న్యూస్




## లాభాలతో ముగిసిన సూచీలు.. 25,700 ఎగువకు నిఫ్టీ



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాలతో ముగిశాయి. పీఎస్‌యూ బ్యాంక్, హెల్త్‌కేర్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. ట్రంప్ వివిధ దేశాలపై విధించిన సుంకాలు చెల్లుబాటు కావంటూ ఆ దేశ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కారణంగా ప్రపంచ మార్కెట్లతో పాటు మన సూచీలు రాణించాయి. సెన్సెక్స్ ఉదయం 82,906.83 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,814.71) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లో కదలాడిన సూచీ.. ఇంట్రాడేలో 83,486.15 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 479.95 పాయింట్ల లాభంతో 83,294.66 వద్ద ముగిసింది. నిఫ్టీ 141.75 పాయింట్ల లాభంతో 25,713 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.88గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. క్వాలిటీ వాల్స్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, ట్రెంట్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71.38 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 5147 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## సుప్రీం తీర్పు ఎఫెక్ట్.. రేపటి నుంచి ట్రంప్ టారిఫ్‌లు బంద్



ప్రపంచదేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎడాపెడా విధించిన టారిఫ్‌లు చెల్లవని అగ్రరాజ్య సుప్రీంకోర్టు ఇటీవల సంచలన తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో తీర్పునకు అనుగుణంగా అమెరికా యంత్రాంగం చర్యలు ప్రారంభించింది. సుప్రీంకోర్టు చెల్లవని చెప్పిన టారిఫ్ లను మంగళవారం నుంచి వసూలు చేయబోమని యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ ప్రకటించింది. 'అంతర్జాతీయ అత్యయిక ఆర్థిక అధికారాల చట్టం' (ఐఈఈపీఏ) కింద ట్రంప్ విధించిన టారిఫ్‌ల వసూళ్లను.. అమెరికా కాలమానం ప్రకారం ఫిబ్రవరి 24వ తేదీ నుంచి నిలిపివేయనున్నట్లు పేర్కొంది. ఇదే సమాచారాన్ని ఇప్పటికే దిగుమతిదారులకు అందజేసినట్లు తెలిపింది. అయితే, ఇప్పటివరకు దిగుమతిదారులు చెల్లించిన టారిఫ్‌లను రిఫండ్ చేస్తారా? లేదా? అన్నదానిపై కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ స్పష్టతనివ్వలేదు. ఈ టారిఫ్‌లు చెల్లవంటూ అమెరికా (ఖూూా) సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన మూడు రోజుల తర్వాత నిలిపివేతపై ప్రకటన వెలువడటం గమనార్హం. అధ్యక్షుడి అత్యవసర అధికారాల చట్టాన్ని వినియోగిస్తూ ప్రతీకార సుంకాలు విధించడాన్ని తప్పుబట్టిన అగ్రరాజ్య అత్యున్నత న్యాయస్థానం.. ఆ టారిఫ్‌లను రద్దు చేస్తూ ఫిబ్రవరి 20న తీర్పు వెలువరించింది. అయినప్పటికీ ట్రంప్ వెనక్కి తగ్గలేదు. ప్రపంచదేశాలపై 15 శాతం సుంకాలు విధిస్తున్నట్లు మళ్లీ ప్రకటన చేశారు. ఈ కొత్త టారిఫ్‌లు ఫిబ్రవరి 24వ తేదీ నుంచే అమల్లోకి వస్తాయని చెప్పినప్పటికీ.. ఇందుకు సంబంధించి ఎగ్జిక్యూటివ్ ఆదేశాలు ఇంకా జారీ కాలేదు. దీంతో కొత్త టారిఫ్‌లు రేపటి నుంచే వర్తిస్తాయా? లేదా అన్నదానిపై స్పష్టత లేదు. కాగా.. ఈ పరిణామాలతో భారత్‌పై సుంకాలు 50శాతం నుంచి 15 శాతానికి దిగొచ్చాయి.

## భారీగా పతనమైన ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ షేర్లు




ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ షేర్లు సోమవారం నాటి ట్రేడింగ్ ఆరంభం నుంచి భారీగా పతనం అవుతున్నాయి. ఒకానొక దశలో దాదాపు 20%శాతం పతనమయ్యాయి. ఆ తర్వాత కొద్దిగా కోలుకొన్నా.. భారీ నష్టాల్లోనే కొనసాగుతున్నాయి. తమ బ్యాంక్ చండీగఢ్ బ్రాంచిలో రూ.590 కోట్ల మేరకు కుంభకోణం జరిగినట్లు అనుమానిస్తున్నామని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ప్రకటించింది. గవర్నమెంట్ ఖాతాల నిర్వహణలో ఈ మోసం జరిగినట్లు భావిస్తున్నారు. ఫలితంగా ఇన్వెస్టర్లలో ఆందోళన తీవ్రమైంది. దీంతో నేడు ట్రేడింగ్ మొదలైన వెంటనే ఈ షేర్లు లోయర్ సర్క్యూట్‌ను తాకాయి. ఇక ఉదయం 11.08 సమయంలో 15.28శాతం నష్టంతో రూ.70.75 వద్ద ట్రేడవుతున్నాయి. హరియాణా ప్రభుత్వ విభాగం ఒకటి ఈ బ్యాంకులో తమ ఖాతాను క్లోజ్ చేసి నిధులను బదిలీచేయమని కోరగా ఈ కుంభకోణం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సదరు విభాగ పుస్తకాల్లో నగదు.. బ్యాంక్‌ఖాతాలో మొత్తానికి సరిపోలకపోవడంతో అనుమానాలు మొదలయ్యాయి. దీంతో హరియాణా ప్రభుత్వంలోని పలు శాఖలు తమ ఖాతాలను సరిచూసుకోవడం మొదలుపెట్టాయి. అయితే చండీగఢ్ శాఖలోని ఖాతాల్లోనే ఈ సమస్య ఉన్నట్లు తెలుస్తోంది.

## అత్యధిక బొగ్గు ఉత్పత్తి గనిగా గెవ్రా



కోర్బా: ఛత్తీస్‌గఢ్‌లో కోల్ ఇండియాకు చెందిన గెవ్రా గని, వచ్చే ఏడాది 63 మిలియన్ టన్నుల ఉత్పత్తిని సాధించడం ద్వారా, ప్రపంచంలోనే అత్యధిక బొగ్గు ఉత్పత్తి చేసే గనిగా అవతరిస్తుందని సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్ లిమిటెడ్ (ఎస్ఈసీఎల్) సీఎండీ హరీశ్ దుహాన్ వెల్లడించారు. కోల్ ఇండియా అనుబంధ సంస్థ అయిన ఎస్ఈసీఎల్ నిర్వహిస్తున్న గెవ్రా గని, మన దేశంలో అతి పెద్ద ఓపెన్‌కాస్ట్ బొగ్గు గని. 1981 నుంచి ఈ గనిలో తవ్వకాలు సాగుతున్నాయి. ఈ ఏడాది 56 మి.టన్నుల బొగ్గు ఇక్కడ వెలికి తీయనున్నారు. ఈ గని సామర్థ్యాన్ని సంవత్సరానికి 70 మి.టన్నులకు విస్తరించడానికి ఇప్పటికే పర్యావరణ అనుమతి లభించింది కూడా. వచ్చే ఏడాదిలో గెవ్రా గని 63 మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి, ప్రపంచంలోనే నంబర్ వన్ గనిగా మారుతుందని హరీశ్ ధీమా వ్యక్తం చేశారు. అమెరికా (వయామింగ్)లోని పౌడర్ రివర్ బేసిన్‌లో ఉన్న బ్లాక్ థండర్ గని 61-62 మి.టన్నుల ఉత్పత్తితో ప్రపంచంలోనే అతి పెద్ద బొగ్గు గనిగా ఉంది. దీని తర్వాత నార్త్ యాంటెలోప్ రోషెల్ గని ఉంది. గెవ్రా గని ప్రతిష్ఠాత్మక లక్ష్యానికి అవసరమైన 4 ముఖ్యమైన వనరులు - భూమి, యంత్రాలు, మానవ వనరులు, బొగ్గు స్వీకరించే వినియోగదార్ల గిరాకీ అని వివరించారు. కచ్చితమైన ముందస్తు ప్రణాళికతో, అవసరమైన అన్ని వనరులను తమ బృందం కలిగి ఉందని హరీశ్ పేర్కొన్నారు. తగినంత భూమి, అవసరమైన అన్ని పరికరాలు, బొగ్గు సరఫరా కాంట్రాక్టులు, వినియోగదార్ల నుంచి బొగ్గుకు గిరాకీ కూడా బలంగా ఉందని వెల్లడించారు. భారతీయ రైల్వేల మద్దతుతో బలమైన మౌలిక సదుపాయాలు బొగ్గు తరలింపునకు సహాయపడతాయని తెలిపారు. ఎస్ఈసీఎల్‌లోనే 700 మెగావాట్ల సౌర ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని కంపెనీ యోచిస్తోందని సీఎండీ తెలిపారు. ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ కోసం ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ఖనిజాల్లో కొన్ని ప్రాజెక్టులను చేయడానికి కూడా జాయింట్ వెంచర్ ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు వివరించారు. '2026-27లో గెవ్రా గని నుంచి ఉత్పత్తిని 63 మి.టన్నులకు పెంచాలని మేం లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇది ప్రస్తుతం 62 మి.టన్నులు ఉత్పత్తి చేస్తున్న ప్రపంచంలోనే అతి పెద్దదైన అమెరికాలోని బ్లాక్ థండర్ గనిని అధిగమిస్తుంద'ని ఎస్ఈసీఎల్ ఏరియా జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ త్యాగి కూడా పేర్కొన్నారు.

## స్విమ్స్ ఆధ్వర్యంలో కల్లూరు, వాగవేడులో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్

**తిరుపతి,ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్విమ్స్ ఆధ్వర్యంలో సోమవారం వడమాలపేట పిహెచ్సీ పరిధిలోని కల్లూరు గ్రామంలో, ఎంపేడు పిహెచ్సీ పరిధిలోని వాగవేడు గ్రామంలో పింక్ బస్సుల ద్వారా ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్టు వైద్యాధికారులు డాక్టర్ సందీప్, డాక్టర్ సుధీర్ కుమార్ తెలిపారు. ముందుగా క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, ముందస్తు నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సోమవారం కల్లూరు, వాగవేడుల్లో నిర్వహించిన క్యాంపుల్లో బిపి, షుగరు పరీక్షలతోపాటు పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. మహిళలు, పురుషులు విశేషంగా విచ్చేసి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు. స్విమ్స్ డైరెక్టర్ /వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటి మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్, నోడల్ ఆఫీసర్లు డాక్టర్ టివిడి.ప్రత్యూష, డాక్టర్ ఎం.లలిత్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాల్లో స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ హరిత, డాక్టర్ పద్మావతి, ఎంఎల్ హెచ్ పి గీతాంజలి, ఏఎన్ఎం లక్ష్మీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## అయోడిన్ లోప వ్యాధులపై శాస్త్రీయ సర్వే



**తిరుపతి,ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి జిల్లాలో జాతీయ అయోడిన్ లోప నియంత్రణ కార్యక్రమం(ఎన్ఐడిడిపి) కింద 2025-26 సంవత్సరానికి సంబంధించిన అయోడిన్ లోప వ్యాధుల(ఐడిడి) సర్వేను జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి ఆధ్వర్యంలో శాస్త్రీయ విధానంలో నిర్వహించారు. జిల్లాలో శాస్త్రీయ నమూనా పద్ధతిలో ఎంపిక చేసిన 30 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఈ సర్వే చేపట్టబడింది. ఎంపిక చేసిన పాఠశాలల్లో 6 నుండి 12 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులపై పరిశీలనలు నిర్వహించబడ్డాయి. సర్వేలో భాగంగా మెడికల్ ఆఫీసర్లు స్వయంగా విద్యార్థుల మెడను పరీక్షించి గోయిటర్ (గళగ్రంథి వాపు) స్థితిని అంచనా వేశారు. ఎంపిక చేసిన విద్యార్థుల ఇళ్ల నుండి వంటలో ఉపయోగిస్తున్న ఉప్పు నమూనాలు సేకరించారు. కొంతమంది విద్యార్థుల నుండి మూత్ర నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పంపించారు. ఈ సర్వే ద్వారా జిల్లాలో అయోడిన్ లోప పరిస్థితిపై కచ్చితమైన సమాచారం సేకరించి, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించబడుతుందని, సేకరించిన సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని డిఎం అండ్ హెచ్ఓ బాలకృష్ణ నాయక్ తెలిపారు. అయోడిన్ లోపం వల్ల పిల్లల్లో మానసిక వికాసం మందగించడం, శారీరక ఎదుగుదలలో ఆలస్యం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఇటువంటి ఆరోగ్య కార్యక్రమాలకు సహకరించాలని ఆయన కోరారు.

## పి-4 బంగారు కుటుంబం పథకం సిఎన్‌జీ ఆటో పంపిణీ

**తిరుపతి,ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పి-4లో(బంగారు కుటుంబం పథకం) కింద, స్వయం ఉపాధి అవకాశాలను ప్రోత్సహించే దిశగా తిరుచానూరు ప్రాంతానికి చెందిన మంగమ్మ కుమారుడు శరవణకు థింక్ గ్యాస్ సంస్థ స్పాన్సర్ చేసిన సిఎన్‌జీ ఆటోను సోమవారం జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ పంపిణీ చేశారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పి-4 బంగారు కుటుంబం పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. థింక్ గ్యాస్ వంటి కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతగా ముందుకు వచ్చి సహకరించడం అభినందనీయమని చెప్పారు. సిఎన్‌జీ వాహనాల వినియోగం వల్ల పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు లభించడంతో పాటు, ఇంధన వ్యయం తగ్గి లబ్ధిదారులకు ఆర్థిక లాభం చేకూరుతుందని కలెక్టర్ వివరించారు. ఈ అవకాశాన్ని శరవణ కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకుని తన కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకోవాలని తెలిపారు.శరవణ మాట్లాడుతూ, పి-4 బంగారు కుటుంబం పథకం ద్వారా తనకు స్వయం ఉపాధి కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్, థింక్ గ్యాస్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి మురళీమోహన్, థింక్ గ్యాస్ ప్రతినిధులు ప్రసాద్, చాణక్య సంబంధిత అధికారులు,శరవణ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సర్వేశ్వరుడికి శాంతి అభిషేకాలు



**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగియడంతో ఉత్సవమూర్తులకు శాంతి అభిషేక పూజలు ఆగమోక్తంగా జరిగాయి. సోమవారం ముక్కంటి ఆలయ ఆవరణలోని అలంకార మండపం వద్ద యాగ పూజలు నిర్వహించారు. ఆలయ అను వంశీక ప్రధాన దీక్షా గురుకుల్ స్వామినాథన్ నేతృత్వంలో పూర్ణా హుతి జరిగింది. అనంతరం ఆలయంలోని అలంకార మండపంలో కొలువుదీరిన శ్రీ జ్ఞాన ప్రసూనాంబిక సమేత సోమస్కంద మూర్తి, శ్రీ-కాళ-హస్తులు, భరద్వాజ మహర్షి, శ్రీ వినాయక స్వామి, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి, భక్తకన్నప్ప, చండికేశ్వరుడు, దక్షిణామూర్తి, నిత్య కళ్యాణ, నిత్యోత్సవ, ప్రదోషమూర్తులు, గౌరీదేవి, అయ్యప్ప, తొండమాన్ చక్రవర్తితో పాటు వివిధ ఉత్సవమూర్తులకు అభిషేకాలు పూర్తి చేశారు. చివరగా యాగ కలశం లోని పవిత్ర జలంతో అభిషేకాలు నిర్వహించి ఉత్సవమూర్తులకు అలంకరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొట్టేసాయి ఈవో బాపిరెడ్డి బోర్డు సభ్యులు ఆలయ అధికారులు పాల్గొన్నారు.




## ముక్కంటి సేవలో ఇంగ్లాండ్ దేశస్తులు



**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం పరదేశీయులు సందడి చేశారు. సంప్రదాయ దుస్తులతో ఇంగ్లాండ్ దేశానికి చెందిన 18 మంది బృందంగా విచ్చేశారు ముందుగా ఆలయంలో జరిగే రాహు కేతు సర్ప దోష నివారణ పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.అదేవిధంగా ఆలయంలోపల వినాయక స్వామి, సుబ్రహ్మణ్య స్వామి, శని భగవానుని, ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు ఇక్కడి ఆలయ శిల్పకళ సౌందర్యాన్ని చూసి ఆనందం వ్యక్తం చేశారు. పురాతన కాలంలో నిర్మించిన గోపురాలు ఆలయంలో స్తంభాలపై చెక్కిన శిల్పకళలలను చూసి ఆత్మానందాన్ని పొందారు.

## ఇంటర్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**తిరుపతి,ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఇంటర్ పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో తిరుపతి నగరంలోని వరదరాజ నగర్ లోని నారాయణ జూనియర్ కళాశాల, శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసి ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కు తావివ్వకుండా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. చీఫ్ సూపరింటెండెంట్లను, ఇన్విజిలేటర్లతో మాట్లాడి పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించడానికి చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకు న్నారు. పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటుతో అమరావతి ఇంటర్మీడియట్ బోర్డుకు అనుసంధానంతో పర్యవేక్షణ జరుగుతోందని, క్యాంపస్ లో మెడికల్ సిబ్బంది క్యాంపు ఏర్పాటు, త్రాగునీరు, తగినంత వెలుతురు, బందోబస్తు అన్ని ఏర్పాట్లు ఉన్నాయని అధికారులు వివరించారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా పర్యవేక్షించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరిక్షా కేంద్రాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణను కలెక్టర్పరిశీలించారు.

## 22-ఏ నుంచి తొలగించండి

### - అసెంబ్లీలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



**తిరుపతి, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీలను 22-ఏ పరిధి నుంచి తొలగించాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. సోమవారం ఉదయం జీరో అవర్‌లో అసెంబ్లీలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ 30 ఏళ్లకు పైగా నివాసం ఉంటున్న ప్రాంతాలు 22-ఏ కింద ఉండటంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నగరంలోని ద్వారకా నగర్, రాఘవేంద్ర నగర్, రామచంద్ర నగర్, శివజ్యోతి నగర్, చింతలచేను, జీవకోన, చెన్నారెడ్డి కాలనీతో పాటు మరికొన్ని ప్రాంతాలు 22-ఏ పరిధిలో ఉన్నాయని ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. గత ఐదేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ పాలనలో మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి తనకు అనుకూలంగా లేని ప్రాంతాలను 22-ఏ కింద చేర్చారని ఆయన ఆరోపించారు. ఈ ప్రాంతాలన్నిటినీ 22-ఏ పరిధి నుంచి తొలగించి ఇళ్లు, ఇంటి స్థలాలపై యజమానులకు చట్టబద్ధ హక్కులు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారానికి నిర్దిష్ట చర్యలు

### -ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి వెల్లడి



**తిరుపతి,ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విద్యుత్ వినియోగదారుల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు నిర్దిష్టమైన ప్రణాళికతో చర్యలు చేపడుతున్నామనిఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు.విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం సోమవారం నిర్వహించిన డయల్ యువర్ ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి కార్యక్రమానికి 59 వినతులు అందినట్లు తెలిపారు. తిరుపతిలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల వినియోగదారులు విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా నమోదయ్యే సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత నోడల్ ఆఫీసర్లను ఆదేశించారు. డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్, ఐటి) పి.అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్, హెచ్ఆర్డి) కె.గురవయ్య, డైరెక్టర్/ఫైనాన్స్(ఎఫ్ఏసి) కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణా దేవి, ఆర్.పద్మ, కె.ఆదిశేషయ్య, ఎం.ఉమాపతి, యం.మురళీ కుమార్, యం.కృష్ణా రెడ్డి, సిహెచ్ రామచంద్ర రావు, కె.సంపత్ కుమార్, జనరల్ మేనేజర్లు చక్రపాణి, సురేంద్రరావు, భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, లత తదితరులు పాల్గొన్నారు.

## అందరి సహకారంతో బ్రహ్మోత్సవాలు విజయవంతం

### - అభినందన సభలో ఇఓ బాపి రెడ్డి



**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించిన మహాశివరాత్రి వార్షిక ఉత్సవాలను అన్ని శాఖల సమన్వయంతో ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందని ఇఓ బాపి రెడ్డి, చైర్మన్ కొట్టె సాయి అన్నారు. బ్రహ్మోత్సవాల ముగింపులు పురస్కరించుకొని సోమవారం బ్రహ్మ గుడి వద్ద ఆలయ ఇ.ఓ బాపి రెడ్డి అధ్యక్షతన అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ సిబ్బంది, వేద పండితులు ఎక్కడ ఎలాంటి అడ్డంకులు లేకుండా పకడ్బందీ ప్రణాళికతో ఉత్సవాలు బ్రహ్మండంగా నిర్వహించారని తెలిపారు. ఇందులో ప్రతి శాఖ ఉద్యోగులు సిబ్బంది అంకితభావంతో పనిచేశారన్నారు. ఉత్సవాల్లో ప్రస్తుతం జరిగిన లోటు పాట్లను గుర్తించి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ధర్మకర్తల మండల చైర్మన్ కొట్టె సాయి ప్రసాద్ నేతృతంలో సభ్యులందరూ ఇ.ఓను సత్కరించారు. కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 443 అర్జీలు



**తిరుపతి,ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేందర్ రెడ్డి, శివ శంకర్ నాయక్, రోజ్మాండ్ లతో కలసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.అర్జీదారులకు గౌరవప్రదంగా కుర్చీ ఏర్పాటుతో, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు త్రాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్, గ్రామాల నుండి వచ్చు అర్జీ దారులకు టి సరఫరా తదితర సౌకర్యాలను కల్పించి వారి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పీజిఆర్ఎస్ అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని, పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ ఓపెనింగ్ లేకుండా అర్జిదారుడు సంతృప్తి చెందేలా అర్జీలకు పరిష్కారం చూపాల పీజిఆర్ఎస్‌లో వచ్చు అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. పీజీఆర్ఎస్‌లో మొత్తం 443 అర్జీలు రాగా అందులో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 259 ఉన్నాయి.మిగతావి శాఖల వారీగా గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ-33, పంచాయతీ రాజ్-32, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్-18,సర్వే శాఖ-17, హోమ్-13,ఏ.పి.ఎస్.పి.సి.సి.ఎల్-10, సివిల్ సప్లై-7, ఫ్యామిలీ వెల్ఫర్-6, వాటర్ రిసోర్సెస్-6,హౌసింగ్-3, స్కూల్ ఎడ్యుకేషన్-5, సెకండరీ హెల్త్- 5, బి.సి.వెల్ఫర్ -3, తుడా -3,ఏపీఎస్ఆర్టీసీ-2, ఐ అండ్ పీ ఆర్- 2, వ్యవసాయ శాఖ-1, డిసేబుల్ వెల్ఫేర్-1, ఎండోమెంట్ -1, ట్రాన్స్పోర్ట్ -1, తెలుగు గంగ ప్రాజెక్ట్-1, డా.ఎన్.టిఆర్ వైద్య సేవ-1, టి.టి.డి-1, ఎంప్లాయిమెంట్-1, ఎస్.సి కార్పొరేషన్-1,మత్స్యశాఖ-1, రూరల్ డెవలప్మెంట్ -1, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్-1, ఏపీఐఐసీ -1, ఎస్సీ కార్పొరేషన్ -1, అటవీశాఖ -1, ఎల్‌డిఎం-1, రూరల్ వాటర్ సప్లై ఇంజనీరింగ్-1, లేబర్-1, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్-1.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 35 వినతులు: కమిషనర్



**తిరుపతి, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 35 వినతులు అందినట్లు కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో 20 మంది కార్యాలయంకు నేరుగా వచ్చి వినతులు సమర్పించగా, 15 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు.తమ వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ కమిషనర్‌ను కోరారు. లక్ష్మీపురం కూడలిని ప్రారంభించాలని, ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలని, 18వ వార్డులోని శ్మశానం వద్ద మౌళిక సదుపాయాలు కల్పించాలని కార్పొరేటర్ ఎస్.కె బాబు ఫోన్ ద్వారా కోరారు. టీటిడి పరిపాలనా భవనం పక్కన గల రోడ్డులో స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని, ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద యూడీస్ వలన ఇబ్బందిగా ఉంది పరిష్కరించాలని, పద్మావతి పార్క్ వాకింగ్ ట్రాక్ బాగు చేయాలని, కృష్ణాపురం ఠానా వద్ద తోపుడు బండ్లు ఎక్కువ కావడంతో పార్కింగ్ ఇబ్బందిగా ఉంది పరిశీలించాలని, డివైడర్ల మధ్య చెట్లు ఎండిపోతున్నాయి నీరు పట్టాలని, సీపీయం కార్యాలయం వద్ద రోడ్లు గుంతలు పూడ్చాలని, జగజ్జీవన్ రామ్ పార్క్ వద్ద పెద్ద కాలువ బ్లాక్ అయ్యింది పరిష్కరించాలని, వినతులు అందాయి.మహిళా వర్సిటీ రోడ్డు ను ఇరువైపులా చిరు వ్యాపారులు ఆక్రమించడంతో తలెత్తిన ఇబ్బందిని పరిష్కరించాలని, టిడిఆర్ బాండ్లు ఇప్పించాలని, కొబ్బరికాయల వ్యాపారస్థులు చెత్త ఎక్కడివక్కడే పడేస్తున్నారు చర్యలు చేపట్టాలని, రైల్వే కాలనీ పార్క్ వద్ద చెత్త కాల్చడంపై చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల వాసులు కోరారు. ఆయా విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిసిపీ ఖాన్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, ఏసీపీ లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు అయోడిన్ పరీక్షలు




**శ్రీకాళహస్తి రూరల్, ఫిబ్రవరి 23 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అయోడిన్(ఉప్పు) వాడకం వల్ల విద్యార్థులకు సూక్ష్మ పోషకాలు లభ్యమవుతాయని యుపిహెచ్సి శ్రీరామ్ నగర్ కాలనీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాలు అన్నారు. సోమవారం అయోడిన్ సర్వేలో భాగంగా జిపిఎస్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అయోడిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో విద్యార్థులలో పోషక ఆహార స్థితిగతులను అధ్యయనం చేయడానికి అయోడిన్‌కి సంబంధించి బృహత్తర కార్యక్రమం చేపట్టామన్నారు. విద్యార్థులకు అయోడిన్(ఉప్పు) వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. అయోడిన్ లోపం ఉంటే జీవక్రియ మందగిస్తుందని, దీనివల్ల అలసట, అసహనం, బలహీనత, బరువు పెరగడం వంటి సమస్యలు తలెత్తుతాయి అన్నారు. థైరాయిడ్ గ్రంథి సరైన మోతాదులో హార్మోన్ విడుదల చేయాలంటే అయోడిన్ వాడకం తప్పనిసరి అని అన్నారు. అయోడిన్ వాడకం వల్ల అనేక లాభాలు ఉన్నాయని, శారీరక, మానసిక, ఆరోగ్యం, పెరుగుదల, చురుకుదనానికి ఉప్పు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ కళావతి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027